

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కార్యక్రమాన్ని రద్దుచేసినట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తెలిపారు. ఈనెల 14,15 తేదీల్లో నగరంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమైనందున పీజీఆర్ఎస్ రద్దుచేస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా నిర్వహిస్తామన్నారు. ఇవే కారణాలతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, పోలీస్ కమిషనరేట్‌లో జరగాల్సిన పీజీఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్, సీపీ తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక పాఠాలు



గంభీరంలోని ఐఐఎం సెంటర్

- ఐఐఎంలో నిర్వహణకు సన్నాహాలు
- ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం
- ఇప్పటికే ఉన్నత విద్యా మండలి, యాంఫీతో ఒప్పందం
- ఏటా 20 వేల మందికి అందనున్న శిక్షణ
- తొలి దశలో అధ్యాపకులకు వచ్చే నెల 13 నుంచి ప్రారంభం

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులకు ఆర్థిక అంశాలపై (పెట్టుబడి పెట్టే మార్గాల)పై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఇప్పటికే భారత్ అభివృద్ధి చెందిన ఆర్థిక దేశాల జాబితాలో కీలక స్థానానికి చేరుకుంది. అగ్రస్థానానికి చేరుకునే దిశగా నిర్ణయాలను తీసుకుంటోంది. ఆ స్థాయికి ఎదగాలంటే ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత (అవగాహన) అవసరమని నిపుణులు చెబుతున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ ఆఫ్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) నిర్ణయించాయి. ఈ మేరకు ఐఐఎంతో ఒప్పందం చేసుకున్నాయి.

భవిష్యత్తులో పెట్టుబడులుపెట్టే వర్గాలుగా మారనున్న విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు వీలుంటుందని ఏఎంఎఫ్ఐ భావించింది. ఈ నేపథ్యంలోనే దేశంలోనే తొలిసారిగా విద్యార్థులకు ఆర్థిక పాఠాలు బోధించేందుకు సిద్ధమైంది. విద్యార్థులకు శిక్షణ అందించేందుకు విశాఖలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)తో రాష్ట్ర ప్రభుత్వం, ఏఎంఎఫ్ఐ ఎంవోయూ చేసుకున్నాయి.

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ..

అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) దేశంలోని అన్ని సెబీ నమోదిత మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన లాభాపేక్ష లేని, స్వీయ నియంత్రణ కలిగిన సంస్థ. మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీని వృత్తిపరంగా, నైతికంగా అభివృద్ధిచేయడం, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడడం, పారదర్శకతను ప్రోత్సహించడం దీని ప్రధాన కార్యకలాపాలు. ఈ సంస్థ ప్రధానంగా మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన కల్పించేందుకు, పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంపొందించేందుకు కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈమేరకు సామాజిక మాధ్యమాలు, ఇతరమార్గాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. అయితే, వీటివల్ల ఆశించినస్థాయిలో ఫలితాలు రావడం లేదని భావించిన సంస్థ

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

- జిల్లాలో 1.85 లక్షల మంది విద్యార్థులు
- ఎంఆర్సీ క్లస్టర్ కాంప్లెక్స్‌లలో ప్రశ్నపత్రాలు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు జరగనున్నాయి. తొలి రోజు సోమవారం ఉన్నత పాఠశాలల విద్యార్థులు, మంగళవారం నుంచి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయిజ

ఈనెల 19వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు 76 వేలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1.09 లక్షలు వెరసి 1.85 లక్షల మంది రాయనున్నారు. ఒకటి నుంచి ఐదు, ఎనిమిది నుంచి పదోతరగతి వరకు విద్యార్థులకు ఉదయం, ఆరు, ఏడు తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఈనెల 11న తెలుగు, 12న ఇంగ్లీష్, 13న గణితం, 14న ఈవీఎస్, 15న ఓఎస్ఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లీష్, 13న గణితం, 14న జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, 15న బయాలజీ సైన్స్, 17న సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగుతాయి. ఓరియంటల్ పాఠశాలల విద్యార్థులకు 18వ తేదీన సంస్కృతి/హిందీ/అరబిక్/పర్షియాలో పేపర్ 1, 19 పేపరు-2 పరీక్ష నిర్వహిస్తారు.

ఒకటోతరగతి నుంచి ప్రతి పేపరు 80 మార్కులు, పదోతరగతిలో 100 మార్కులకు ప్రశ్నపత్రాలను ఎస్సీఈఆర్టీ రూపొందించి జిల్లాలకు పంపింది. ఉన్నత పాఠశాలల ప్రశ్నపత్రాలు మండల రిసోర్స్ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల ప్రశ్నపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్‌లలో భద్రపరిచారు. ప్రతి రోజు పరీక్ష ప్రారంభానికి గంట ముందు పాఠశాలలకు ప్రశ్నపత్రాలు అందజేయాలని

... మిగతా 6వ పేజీలో

వీధికుక్కలపై మల్లగుల్లాలు!

తరలింపు సాధ్యాసాధ్యాలపై చర్చ

- సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్యలకు సిద్ధమవుతున్న జీవీఎంసీ అధికారులు
- నగరంలో సుమారు రెండు లక్షల వీధికుక్కలు
- వాటికి ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటుకు లక్ష కెన్నెల్స్ అవసరం
- భారీగా బడ్జెట్, సిబ్బందిని నియమించాలి
- గణాంకాలతో సిద్ధమవుతున్న జీవీఎంసీ అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

'ఆస్పత్రులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విద్యాసంస్థల్లో వీధికుక్కలు కనిపించడానికి వీల్లేదు. రెండువారాల్లోగా వాటన్నింటిని రీహాబిలేటషన్ సెంటర్లు, ఫీడింగ్ సెంటర్లకు తరలించాలి. వీధుల్లో తిరిగే కుక్కలను ఆపరేషన్ తర్వాత తిరిగి పట్టుకున్న చోట విడిచిపెట్టకుండా, రీహాబిలిటేషన్ సెంటర్‌లోనే ఉంచాలి.' రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలకు సుప్రీంకోర్టు తాజాగా జారీచేసిన ఆదేశాలివి...



రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై ప్రయాణికుల మధ్య శునకం

సుప్రీంకోర్టు ఆదేశంతో వీధికుక్కల నియంత్రణపై అధికారులు మల్లగుల్లాలుపడుతున్నారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం రెండు లక్షల వరకు వీధికుక్కలు ఉంటాయని అంచనా. ఇవన్నీ వీధులు, ఆస్పత్రులు, బస్టాండ్లు, ఖాళీ స్థలాలు, పార్కుల్లో సంచరిస్తుంటాయి. తరచూ ఎక్కడో ఒకచోట చిన్నారులు, మహిళలు, రోడ్లపై నడుచుకుంటూ వెళ్లేవారిని, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని కరుస్తుంటాయి.బాధితులు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, అర్బన్‌హెల్త్‌సెంటర్లకు వెళ్లి యాంటీరేబిస్ వ్యాక్సిన్లు (ఏఆర్‌వీ) వేయించుకుంటారు. కొన్నిసార్లు కుక్కకాటుని నిర్లక్ష్యం చేయడం, సరియైన విధానంలో వాక్సిన్ తీసుకోకపోవడం వంటి కారణాలతో రేబిస్ సోకి మృత్యువాతపడుతున్నారు. నగరంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కేజీహెచ్, ఘోషాస్పత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి, ప్రాంతీయ కంటిఆస్పత్రి, టీబీ ఆస్పత్రుల ఆవరణలోకి వీధికుక్కలు చొరబడి స్వైరవిహారం చేస్తున్నాయి. వివిధ రుగ్మతలతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చేవారితోపాటు వారి సహాయకులను కాటేస్తున్నాయి. ద్వారాకా, మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్, బస్ షెల్టర్లలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. నగరంలో ప్రతి చోటీ వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు జీవీఎంసీ ఏటా రూ.15 లక్షల వరకు వెచ్చిస్తున్నా వాటి సంఖ్య తగ్గకపోగా, పెరిగిపోతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో...

నియంత్రణే ధ్యేయం

దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో కుక్కకాటు బాధితులు, మృతుల సంఖ్య పెరుగుతోంది. ఈనేపథ్యంలో వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు భావించింది. వీధికుక్కల నియంత్రణకు అన్నిరాష్ట్రాలతోపాటు స్థానిక పట్టణ సంస్థలకు మార్గదర్శకాలతోపాటు ఆదేశాలు జారీచేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో కుక్కలు చొరబడకుండా రెండు వారాల్లోగా ఫెన్సింగ్ వేయించుకోవాలని, మూడు నెలలకు ఒకసారి కుక్కలు ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయా? లేదా? ఎవరినైనా కాటేశాయా? తనిఖీ చేయాలని ఆదేశించింది. కుక్కల నియంత్రణకు కేర్‌టేకర్‌ను నియమించుకోవాలని సూచించింది. వీధులు, బస్టాండ్‌ల్లో వీధికుక్కలు కనిపించకుండా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు

... మిగతా 6వ పేజీలో

పోలీస్‌స్టేషన్‌లో యువతి ఆత్మహత్యాయత్నం

- ప్రియుడితో పెళ్లి చేయలేదని మనస్తాపం
- ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు

గాజువాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వాడితో పోలీసులు పెళ్లి చేయలేదనే మనస్తాపంతో ఓ యువతి గాజువాక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి చెందిన యువతి, అనకాపల్లికి చెందిన వీరయ్యస్వామి అచ్చుతాపురంలోని ఓ సంస్థలో పనిచేసేవారు. ఈ క్రమంలో వారిద్దరిమధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. కొంతకాలం తరువాత యువతి అచ్చుతాపురంలో పని మానేసి గాజువాకలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తూ శ్రీనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఏడేళ్ల పాటు కలిసి తిరిగిన వీరయ్యస్వామి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో పది రోజులకిందట గాజువాక పోలీసులను ఆశ్రయించింది. దీనిపై ఆదివారం పోలీసులు ఇద్దరినీ పిలిపించారు. ఈ క్రమంలో యువతి వీరాస్వామితో తనకు పెళ్లి చేయాలని పట్టుబట్టింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తుండగానే హ్యాండ్‌బ్యాగ్‌లోని నెయిల్ పాలిష్ తీసుకుని తాగేసింది. వెంటనే పోలీసులు ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాజువాక సీఐ ఎ.పార్థసారధి ఆస్పత్రికి వెళ్లి యువతిని విచారించారు. అయితే ప్రియుడిపై ఫిర్యాదు చేయడానికి ఆమె నిరాకరించి, పెళ్లి చేయాలని మాత్రమే పట్టుబడుతుండడంతో వీరయ్యస్వామితో చర్చిస్తున్నారు.

15 వేల ఇళ్లు రద్దు?

నిర్మాణాలకు వీలుకాని ప్రదేశాల్లో లే అవుట్లు

- గత ప్రభుత్వ హయాంలో గెడ్డవాగులు, చెరువుగర్భాల్లో ప్లాట్లు
- అక్కడ నిర్మాణాలకు లబ్ధిదారుల విముఖత
- ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చేందుకు యత్నాలు



ఆనందపురం మండలం కణమాంలో గెడ్డలో వేసిన లే అవుట్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లోని ఎన్టీఆర్ నగర్స్ కాలనీల్లో నిర్మాణాలకు వీలుకాని సుమారు 15 వేల ఇళ్ల రద్దుకు గృహనిర్మాణ సంస్థ యోచిస్తోంది. ఇటీవల నగరానికి వచ్చిన గృహ నిర్మాణ సంస్థ ఎండీ అరుణ్‌బాబు ఈవిషయంపై అధికారులకు పలు సూచనలిచ్చారు. ప్రధానంగా కొండవాలులో అభివృద్ధిచేసిన లేఅవుట్‌లలో కొండపైన గుర్తించిన ప్లాట్లలో నిర్మాణాలు సాధ్యంకాదని ఇప్పటికే కాంట్రాక్టర్లు తేల్చిచెప్పారు. ఇంకా గెడ్డవాగులు, వర్షాకాలంలో నీరు ప్రవహించే ప్రాంతాలు, చెరువు గర్భాలలో అభివృద్ధి చేసిన ప్లాట్లలో నిర్మాణాలకు ఇబ్బందులున్నాయి. ఇటువంటి ప్లాట్లలో నిర్మించిన ఇళ్లలో నివాసాలు ఉండలేమని లబ్ధిదారులు చెబుతూ వస్తున్నారు.

నగర శివారుల్లో 65 లేఅవుట్‌లలో సెంటు స్థలాల్లో భారీగా ఇళ్ల నిర్మాణాలను గత ప్రభుత్వ

... మిగతా 6వ పేజీలో

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



ద్వారకాబస్‌స్టేషన్ నుంచి బయలుదేరిన ప్రత్యేక సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచారామాల క్షేత్ర దర్శినికి సంబంధించి మూడు ప్రత్యేక సర్వీసులు ఆదివారం సాయంత్రం ద్వారకాబస్‌స్టేషన్ నుంచి బయల్దేరాయి. ఉన్నతాధికారులు భక్తులను బస్సెక్కించారు. సోమవారం ఉదయం అమరావతి చేరుకుంటాయి. అక్కడ అమరేశ్వరుని దర్శనానంతరం భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలకు చేరుకుంటాయి. ఆయా ఆలయాల్లో భక్తులు శివదర్శనం చేసుకున్న తరువాత సోమవారం రాత్రికి తిరిగి ద్వారకాబస్‌స్టేషన్‌కు చేరుకుంటాయి. ఈ సర్వీసులు శని, ఆదివారాల్లో నడుపుతున్నట్టు ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. 35 మంది భక్తులు బృందంగా పంచారామాలకు వెళ్లాలనుకుంటే ఏరోజైనా ప్రత్యేక బస్సు నడుపుతామన్నారు.

పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులు

పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల సందర్భంగా ఈనెల 19 నుంచి ఐదు రోజుల పాటు ద్వారకాబస్‌స్టేషన్ నుంచి పుట్టపర్తికి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు ఏసీ,నాన్ ఏసీ సర్వీసులు నడుపుతామని ఆర్ఎం వెల్లడించారు.ఈఅవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలనికోరారు.

ఎగుమతుల హబ్‌గా ఏపీ

ఎంఎస్ ఎంఈ చైర్మన్ శివశంకర రావు



సదస్సులో మాట్లాడుతున్న శివశంకరరావు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు అన్నారు. హోటల్ మేరియట్‌లో ఆదివారం జరిగిన ఏపీ ఎంఎస్ఎంఈ ఎగుమతుల అభివృద్ధి సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ రంగానికి సంబంధించి ఎగుమతుల హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనకు అనుగుణంగా కార్పొరేషన్ ఇప్పటివరకు మూడు సదస్సులు నిర్వహించిందన్నారు.

రాష్ట్రంలోని ఉత్పత్తులకు విదేశీ కొనుగోలుదారులు, స్థానిక ఉత్పత్తిదారులతో అనుసంధానం చేయడమే సంస్థ ఉద్దేశమన్నారు. ఆయా దేశాల్లో మార్కెట్ డిమాండ్‌కు తగిన విధంగా అక్కడి వ్యాపారుల సలహాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఆహార, సముద్ర ఉత్పత్తులు, ఐటీ సర్వీసులు, జౌళి, ఫార్మా తదితర రంగాల ఉత్పత్తుల ఎగుమతులకు అవకాశాలను గుర్తించిన 16 దేశాలకు చెందిన 34 మంది సదస్సుకు హాజరయ్యారన్నారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పరిశ్రమల ఏర్పాటుకు విశాఖ అనువైనదన్నారు. ఎస్ఎంఈ ఇండియా అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం నుంచి 2023లో 3.9 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరగ్గా గత ఏడాది 26 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు. ఘనా దేశానికి చెందిన అబ్బాస్ వ్యవసాయోత్పత్తుల ప్యాకింగ్, నాణ్యతలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శ్రీలంక ప్రతినిధి కొబ్బరి పీచుపరిశ్రమకు ముడిసరుకు ఏపీలో ఉందన్నారు. ముంబైకు చెందిన రాజ్‌బాషా 2030 కల్లా టెలికం రంగంలో ఇండియా నంబర్‌వన్‌గా మారుతుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన సునీతా కృష్ణ సుగంధ ద్రవ్యాల ఎగుమతులకు విశాఖలో ఫెలిసిటేషన్ సెంటర్ ఏర్పాటుచేయాలన్నారు.

బీచ్‌రోడ్డుకు సొబగులు

- సీఐఐ సదస్సు సందర్భంగా సుందరీకరణ పనులు
- ఆర్‌కే బీచ్‌లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు
- ప్రతినిధుల కోసం 800కి పైగా కార్లు
- సేకరణలో నిమగ్నమైన రవాణాశాఖ అధికారులు



ముస్తాబైన ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న పారిశ్రామిక పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు (సీఐఐ) నేపథ్యంలో బీచ్‌రోడ్డుకు అదనపు సొబగులు అద్దుతున్నారు. బీచ్‌రోడ్డు పొడుగునా ఎచ్చదనం ఉట్టిపడేలా అందమైన పూలమొక్కలను నాటుతున్నారు. మరోవైపు సెంటర్ డివైడర్లకు ఉన్న గ్రిల్స్‌కు రంగులు, కూడళ్లలో కొత్తగా వాటర్‌ఫౌంటెయిన్‌లు ఏర్పాటు వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా బీచ్‌రోడ్డులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కురుసుర మ్యూజియంలోని సబ్‌మెరైన్‌కు రంగులు వేస్తున్నారు.

రాత్రిపూట బీచ్‌ఒడ్డున కూర్చొని ఎగసిపడుతున్న అలలను వీక్షించేందుకు వీలుగా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్కేబీచ్ వద్ద తీరంలో నాలుగుచోట్ల ఎత్తైన స్తంభాలను వేసి, వాటిపై అధిక కాంతినిచ్చే హైమాస్ట్‌లైట్లను ఏర్పాటుచేస్తున్నారు. రాత్రి వేళ ఇసుకతెన్నెలను ముద్దాడే అలలు సందర్శకులు, పర్యాటకులకు మధురానుభూతిని కలిగిస్తాయని చెబుతున్నారు. కాగా బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న హైమాస్ట్ లైట్లను ఆదివారం రాత్రి మేయర్ పీలా శ్రీనివాసరావు పరిశీలించారు. సదస్సుకు

... మిగతా 6వ పేజీలో

భాగస్వామ్య సదస్సు పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పనులపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్ల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆదివారం పరిశీలించిన ఆయన వివిధ విభాగాల అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమయం చాలా తక్కువ ఉందని, పనుల్లో వేగం పెంచాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని, నిర్ణీత సమయం కంటే ముందుగా పనులు పూర్తిచేయాలన్నారు. ప్రధానవేదిక, స్వాగత ద్వారాలు, అతిథుల రాక, పార్కింగ్ వసతి తదితర అంశాలపై సూక్ష్మస్థాయి పరిశీలన చేసిన ఆయన పలు ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులపై అధికారులను అప్రమత్తం చేశారు. ఎక్కడా గ్యాప్ రావడానికి వీల్లేదన్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ సీఈకి పలు అంశాల్లో మార్పుచేర్పులపై ఆదేశాలు జారీచేశారు. పర్యటనలో డీసీపీ మణికంఠ చందోలు, సీఎంవో నరేష్ కుమార్, సీఐఐ ప్రతినిధి మౌళి, అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామాలను పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ పుష్పాలతో పూజ చేశారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు.

ఇద్దరు బాలురను రక్షించిన లైఫ్‌గార్డులు



ప్రమాదానికి గురైన బాలురతో సీఐ శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌లో సముద్రంలోకి కొట్టుకుపోతున్న ఇద్దరు బాలురను లైఫ్‌గార్డులు రక్షించారు. పద్మనాభం మండలం రేవిడి పంచాయతీలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కర్రి జశ్వంత్ (13), కర్రి అజయ్‌కుమార్ (14) ఆదివారం భీమిలి బీచ్‌కు విహారానికి వచ్చారు. ఈమేరకు వారు సముద్ర స్నానాలు చేస్తుండగా పెద్ద అల తాకిడికి లోపలికి కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న రుషికొండ మెరైన్ పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసరావు గమనించి లైఫ్‌గార్డులను అప్రమత్తం చేశారు. వారు ఇద్దరు బాలురను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

15న వారిజ ఆశ్రమంలో కార్తీక పూజలు

భీమునిపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మంగమారిపేట వారిజ ఆశ్రమంలో ఈనెల 15, 16వ తేదీల్లో కార్తీక మాస పారాయణలు, స్వామివారి తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 15న కార్తీక బహుళ ఏకాదశి పురస్కరించుకుని రామాయణ పారాయణం జరుగుతుందన్నారు. 16న ద్వాదశి సందర్భంగా లక్ష్మీనారాయణ కల్యాణం, హోమం, కార్తీక భోజనాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు 9247217901, 9441807211 ఫోన్ నంబర్లను సంప్రతించాలని వారు సూచించారు.

గంభీరంలో వనసమారాధన

ఆనందపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం వద్ద ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన జరిగింది. భక్తులతో పాటు పలు కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రాధాన్యతను వివరించారు వన భోజనాలు మన సంస్కృతిలో ఒక భాగమని చెప్పారు. అనంతరం భక్తులు హరి నామ సంకీర్తనలతో సంగీత పరికరాలతో చేసిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. అలాగే పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

సీఐటీయూ మహాసభలపై ప్రచారం



ఆదర్శనగర్‌లో ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తగరపువలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో వచ్చే నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ జాతీయ మహాసభల గురించి స్థానిక నాయకులు చిట్టివలస, తగరపువలస లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్మికుల సంక్షేమం దృష్ట్యా మహాసభలో పలు తీర్మానాలు చేస్తామన్నారు. సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ భీమిలి జోన్ అధ్యక్షుడు ఎస్. అప్పలనాయుడు, నాయకులు సూర్యనారాయణ, రాము. అప్పారావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పర్యాటకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్



భీమిలి బీచ్‌లో సందర్శకుల రద్దీ



భీమిలిలోని కొబ్బరితోట పార్కులో వన భోజనాలు

సందర్శకులతో బీచ్‌లు కిటకిట

సాగర్‌నగర్/భీమునిపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, భీమునిపట్నం బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. పిక్నిక్‌ల సీజన్ ప్రారంభం కావడంతో నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు సముద్ర స్నానాలు చేయగా, మరికొందరు ఇసుక తెన్నులపై ఆటలు ఆడారు. కాగా కార్తీక మాసం మూడవ ఆదివారం కావడంతో భీమిలి బీచ్, బీచ్‌రోడ్‌లోని కొబ్బరితోట, ఎర్రమట్టిదిబ్బలు, జీడిమామిడితోటలు, తొట్లకొండ ప్రాంతాలకు సందర్శకులు తరలివచ్చారు. ఆయా పిక్నిక్ స్పాట్‌లు పర్యాటకులతో కిటకిటలాడాయి. కాగా పర్యాటకులు ఎక్కువగా రావడంతో బీచ్ రోడ్డులో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. పోలీసులు ముఖ్యమైన కూడళలలో ఉండి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

భీమిలి తీరంలో తెప్ప బోల్తా

మత్స్యకారుడి పరిస్థితి విషమం

భీమునిపట్నం,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భీమిలి తీరంలో ఆదివారం సాయంత్రం తెప్ప బోల్తా పడింది.ఈ సంఘటనలో మత్స్యకారుడు పుక్కళ్ళ అమరయ్య అలియాస్ అమ్మోరు (28) ప్రమాదానికి గురవ్వడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉంది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎగువపేటకు చెందిన నలుగురు మత్స్యకారులు శనివారం అర్ధరాత్రి తర్వాత సముద్రంలో వేటకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి వస్తుండగా ఉప్పుటేరు సమీపంలో వెనుక నుంచి పెద్ద కెరటం తెప్పను తాకడంతో బోల్తా పడింది. తెప్పలో ఉన్న వారంతా సముద్రంలో పడిపోగా, అమ్మోరు లోపలికి కొట్టుకుపోయాడు. మిగతా మత్స్యకారులు అతన్ని రక్షించి, ఒడ్డుకు తీసుకువచ్చారు. అయితే అప్పటికే బాగా నీటిని తాగేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. భీమిలి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం సంగివలస ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. యువకుడికి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక భవనం నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న నూకరాజు

భీమునిపట్నం,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ పరిధిలోని 3వ వార్డు ఎన్‌టీఆర్ కాలనీలో సామాజిక భవనం నిర్మించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. ఆదివారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గంటాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో శుభకార్యాల నిర్వహణకు వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సామాజిక భవనం నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అల్లిపిల్లి వేణు, వాసుపల్లి వీరుబాబు, పీత అప్పారావు, దాలిబోయిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బోయిపాలెం విద్యార్థులు

ఆనందపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు పాఠశాల హెచ్‌ఎం కొండబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం నగరంలో జిల్లాస్థాయి కబడ్డీ, సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. వీటిలో కబడ్డీ అండర్ 17 బాలుర విభాగంలో అసనాల ఇనాశ్, బాలికల విభాగంలో ఎస్. యోజిత, అండర్ 14 విభాగం కబడ్డీలో ఎస్. భవానీ, సాఫ్ట్‌బాల్ అండర్ 17 విభాగంలో టి. దీక్ష ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

బీచ్‌లో ప్రమాదాల నివారణపై అవగాహన

సాగర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరంలో జరుగుతున్న ప్రమాదాల నివా రణ గురించి రుషికొండ బీచ్‌లో మెరైన్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మురళీకృష్ణ సందర్శకులకు ఆదివా రం అవగాహన కల్పించారు. బీచ్‌కు వచ్చిన ఈత రాని యువకులను గుర్తించి, ప్రమాదాల గురించి వివరించారు. సురక్షిత ప్రాంతాల్లో సముద్ర స్నానాలు చేయాలని సూచించారు.

కొనసాగిన కెనరా బ్యాంక్ జాతీయ మహాసభలు



జాతీయ మహాసభలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

సాగర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో కెనరా బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహాసభలు ఆదివారం కూడా కొనసాగాయి. రెండు రోజు పలు అంశాలపై విస్తృత చర్చలు, తీర్మానాలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. రవికుమార్ మాట్లాడుతూ 2022లో జరిగిన 19వ సదస్సు నుంచి ఇప్పటివరకు జరిగిన జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక అంశాలపై మాట్లాడారు. బ్యాంకు అధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి, వంద తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ తీర్మానాలను బ్యాంకు యాజమాన్యంతో చర్చించి సఫలీకృతం చేయడానికి కృషి చేస్తామన్నారు. సోమవారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఇతర జాతీయ కార్యవర్గం ఎన్నిక జరగనున్నట్టు వెల్లడించారు.

స్కిల్ పోటీల్లో చిట్టివలస విద్యార్థుల ప్రతిభ

తగరపువలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సెయింట్ ఆంథోనీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 7న జరిగిన జిల్లా స్థాయి రిటైల్ మార్కెటింగ్ నైపుణ్య శిక్షణ (స్కిల్) పోటీల్లో చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పోటీల్లో 9వ తరగతికి చెందిన నీలిమ, ఉజ్వల శాంతి, శైలజ, హేమ ప్రథమ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం డి. ఆదినారాయణ తెలిపారు. అలాగే ఇన్ఫర్మేషన్ విభాగంలో 8వ తరగతికి చెందిన బి. లిఖిత, 9వ తరగతికి చెందిన ఎం. హర్షవర్ధన్, ఆర్. శ్రావ్య ప్రతిభ చూపారు. వారంతా రాష్ట్రస్థాయిలో జరిగే నైపుణ్య శిక్షణ పోటీలకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

మధురవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో నగరానికి చెందిన నృత్య కళాంజలి విద్యార్థులు ఆదివారం కూచిపూడి, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులు రాధ, రాధిక, శిరీష, సహస్ర, సౌమ్య, ధృతి తదితరులు పలు కూచిపూడి, జానపద గీతాలకు నృత్యరీతులు సమకూర్చారు.

నేడు గాజువాక డంపింగ్ యార్డుపై చర్చ

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గాజువాకలోని డంపింగ్‌యార్డు ఆధునికీకరణ కోసం ఇంజనీరింగ్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలపై విజయవాడలో సోమవారం చర్చలు జరగనున్నాయి. గాజువాక డంపింగ్ యార్డులో 2019లో క్లోజ్డ్ కంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) ప్రాజెక్టు నిర్వహణలో కాంట్రాక్టర్ విఫలం కావడంతో యార్డులో చెత్త నిల్వ ఉండిపోతోంది. దీనివల్ల స్థానికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఇటీవల డంపింగ్ యార్డును సందర్శించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా కాంట్రాక్టర్ వైఫల్యాన్ని దాచిపెట్టి, డంపింగ్‌యార్డుకు ఎక్కువ చెత్త వస్తోందని, కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు అంత చెత్తను తరలించలేకపోతుండడంతో యార్డులో నిల్వ ఉండిపోతోందన్నారు. చెత్త తరలింపునకు సీసీఎస్ ప్రాజెక్టు యంత్రాలను రిపేర్లు చేయించడంతో పాటు యార్డులోని చెత్త బయటకు కనిపించకుండా రేకులు షెడ్‌తో మూసేందుకు వీలుగా ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. సోమవారం విజయవాడ వచ్చి ఆ ప్రతిపాదనలను తనకు వివరించాలని పట్టాభిరామ్ ఆదేశించారు. ఈమేరకు అధికారులు ఆదివారం రాత్రి విజయవాడ బయలుదేరి వెళ్లినట్టు తెలిసింది.

కొండారెడ్డి కస్టడీ కోసం పోలీసులు నేడు పిటిషన్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ కేసులో అరెస్టు చేసిన వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డితో పాటు మిగిలిన ఇద్దరు యువకులను కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. కొండారెడ్డి బెంగళూరు నుంచి ఎండీఎంఏ బోల్ట్స్‌స్ట్రిప్‌లను తీసుకువచ్చేందుకు తన స్నేహితుడైన ఇంజనీరింగ్ విద్యార్థి గీత్ చరణ్‌ను గతనెల 31న విమానంలో పంపించాడు. అతను ఈనెల 2న రైలులో 48 ఎండీఎంఏ బోల్ట్స్‌ను నగరానికి తీసుకువస్తుండగా , వాటిని తీసుకునేందుకు కొండారెడ్డితోపాటు మరో ఇంజనీరింగ్ విద్యార్థి హర్షవర్ధన్‌నాయుడు రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా వారిని పట్టుకుని నాలుగోపట్టణ పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టాల్సి ఉండడంతో నిందితులు ముగ్గురినీ కస్టడీకి తీసుకుంటామని డీసీపీ మేరీప్రశాంతి ఈనెల మూడున విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈమేరకు సోమవారం వారిని కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేయాలని నగర పోలీసు ఉన్నతాధికారులు ఫోర్త్‌టౌన్ పోలీసులను ఆదేశించినట్టు సమాచారం.

బాలలతో రైళ్లలో భిక్షాటన

ఆర్పీఎఫ్ అదుపులో ఇద్దరు మహిళలు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలను (ట్రాఫికర్లు) ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి బృందం అదుపులోకి తీసుకుది. రైళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టి ఛత్తీస్‌గఢ్, రాయపూర్‌కు చెందిన సుధాకుమారి అలియాస్ శింత, సుఖ్‌బాయి ఢాఢీ అనే ఇద్దరు మహిళలను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. గుర్తు తెలియని వ్యక్తులు డబ్బు ప్రలోభపెట్టి జన్మభూమి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లలో భిక్షాటన చేయిస్తున్నట్లు విచారణలో నిందితులు వెల్లడించారు. బాలలతోపాటు అదుపులోకి తీసుకున్న మహిళలను జీఆర్పీకి అప్పగించారు. బాలలను చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రభుత్వ బాలల వసతి గృహాలకు పంపారు. ట్రాఫికర్లపై కేసు నమోదు చేసి రాయపూర్‌లోని ఖరోరా పోలీసు స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

నేటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

విద్యాశాఖ ఆదేశించింది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలనిఎంఈవో/ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ఈనెల 25వతేదీలోగా జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తిచేసి నెలాఖరులోగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని ఆదేశించింది. జిల్లాలో సమ్మేటివ్ పరీక్షలకు సంబంధించి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో ప్రేమ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు.

15 వేల ఇళ్లు రద్దు?

... 5వ పేజీ తరువాయి

హయాంలోనే ప్రారంభించారు. అప్పట్లో ఇళ్ల నిర్మాణాలకు వీలులేకపోయినా అధికారులు ఇష్టానుసారంగా లేఅవుట్‌లు రూపొందించారు. కొండలపైన, గెడ్డలు, వాగులు, చెరువులు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలని చూడలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొత్తం లక్ష మందికి పట్టాలిచ్చామని అప్పటి ప్రభుత్వం గొప్పలకు పోయింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకోకుండా ప్లాట్లు వేసి లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయించారు. అదే సమయంలో ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే లేఅవుట్‌లను పరిశీలించిన కాంట్రాక్టర్లు నిర్మాణాలకు అనువుగా ఉన్న ప్లాట్లను గుర్తించారు. అక్కడే పనులు ప్రారంభించారు. నిర్మాణాలకు వీలుకాని ప్లాట్లను పక్కనపడేశారు. చాలా లేఅవుట్‌లలో ఇటువంటివి పదుల సంఖ్య నుంచి వందల వరకు ఉంటాయి. సబ్బవరం మండలం అసకపల్లిలో కొండవాలు నుంచి పైవరకు లేఅవుట్‌వేశారు. అక్కడ వాలు ప్రాంతంలోనే నిర్మాణాలు చేపట్టారు. కొండపైన ఇళ్ల నిర్మాణాలకు ప్రయత్నించి వీలుకాకపోవడంతో విడిచిపెట్టేశారు .పైడివాడ అగ్రహారం చెరువు గర్భంలో కొన్ని ఇటువంటి ప్లాట్లను వదిలేశారు. అనకాపల్లి మండలం కుంచంగి, కూండ్రంలో తొమ్మిదివేలకుగాను ఆరువేల వరకు నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికీ రోడ్డు సదుపాయం లేకపోవడంతో లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. ఆనందపురంలోని కణమాం లేఅవుట్ గెడ్డవాగులో ప్లాట్లను వదిలేశారు. అధికారులు ఒత్తిడిచేసి నిర్మాణాలు చేపట్టాలంటే ప్రస్తుతం యూనిట్ ధర రూ. 1.8 లక్షలు సరిపోదని, మరో లక్ష వరకు ఇవ్వాల్సి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇలా సుమారు 15 వేల ఇళ్లు ఉంటాయని అధికారులు అంచనావేస్తున్నారు. ప్రస్తుతం లక్ష ఇళ్ల ప్రాజెక్టు వచ్చే ఏడాది జూన్ నెలాఖరుతో ముగుస్తోంది. అందువల్ల నిర్మాణాలకు వీలుకాని ప్లాట్లులో ఇళ్లను రద్దుచేసి వారికి మరో చోట కేటాయించాలనే ఆలోచన చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఎండీ సూచన మేరకు ఇళ్ల వివరాలతో నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.

బీచ్‌రోడ్డుకు సొబగులు

... 5వ పేజీ తరువాయి

హాజరయ్యే ప్రతినిధుల కోసం 800కి పైగా కార్లు అందుబాటులో ఉంచాలని రవాణాశాఖ అధికారులకు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీచేసింది. ఇందులో 600 ఇన్నోవా, వందకుపైగా ఫైవ్‌సీటర్ సెడాన్‌కార్లు, సదస్సుకు హాజరయ్యే ప్రముఖులు, పారిశ్రామికవేత్తల కోసం 30 బెంజ్‌లు, 30 బీఎండబ్ల్యూ కార్లు కావాలని ఇండెంట్‌పంపింది.వీటితోపాటు 15 బస్సులు, వీఐపీల కాన్వాయ్ కోసం 50 వరకు అదనపు కార్లు అవసరమని భావిస్తున్నారు. ఈమేరకు వాటిని సమకూర్చుకోవడంలో రవాణాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఇన్నోవా, సెడాన్ కార్లు నగరంతోపాటు అనకాపల్లి, విజయనగరం జిల్లాలోని ట్రావెల్స్ నిర్వాహకుల వద్ద అందుబాటులో ఉన్నప్పటికీ, బెంజ్, బీఎండబ్ల్యూ కార్ల కోసం వెతుకుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయగోదావరి, విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి వాటిని సమకూర్చుకోవడంపై దృష్టిసారించారు. ఎయిర్‌పోర్టులో దిగిన ప్రతినిధులను కేటాయించిన హోటళ్లకు, అక్కడి నుంచి సదస్సు జరిగే ప్రాంగణానికి తీసుకెళ్లడం కోసం కార్లను కేటాయిస్తున్నారు. సదస్సుకు ముందురోజు అంటే 13 నుంచి 15 వరకు కార్లను అద్దె ప్రాతిపదికన సమకూర్చుకుంటున్నట్టు రవాణాశాఖ ఉపకమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.



ఆర్‌కే బీచ్‌లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ అధికారులు

వీధికుక్కలపై మల్లగుల్లాలు!

... 5వ పేజీ తరువాయి

చర్యలు తీసుకోవడంతోపాటు వాటిని బయటకు తరలించాలని ఆదేశించింది. వీధికుక్కలకు ఆపరేషన్ చేసిన తర్వాత పట్టుకున్నచోట వదలకుండా రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచాలని స్పష్టంచేసింది. మిగిలిన కుక్కలకు ఫీడింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి నీరు, ఆహారం అందజేయాలని సూచించింది.

అధికారుల తర్జనభర్జన

సుప్రీంకోర్టు ఆదేశాలు జీవీఎంసీ అధికారుల్లో కలవరం రేపుతున్నాయి. నగర పరిధిలో రెండు లక్షల వరకు ఉన్న వీధి కుక్కలను రీహాబిలిటేషన్ సెంటర్లు, ఫీడింగ్ కేంద్రాలకు తరలించాలంటే పెద్ద దింత్రాంగమే అవసరమంటున్నారు. కుక్కలను పట్టుకోవడానికి సిబ్బందితోపాటు తరలించడానికి వాహనాలు సమకూర్చుకోవాలి. వాటిని ఉంచడానికి భారీగా కెన్నెల్స్‌ను కొనుగోలుచేయాలి. ఒక కెన్నెల్‌లో రెండు కుక్కలను ఉంచినా లక్ష కెన్నెల్స్ అవసరమవుతాయని, అందుకోసం విశాలమైన స్థలాన్ని గుర్తించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనిపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధికారులు సమావేశమై సుప్రీంకోర్టు ఆదేశాలపై చర్చించి, ఏం చేయాలో నిర్ణయించే అవకాశం ఉంది.

డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక పాఠాలు

... 5వ పేజీ తరువాయి

ఇతర మార్గాలను అన్వేషించింది. ఈ క్రమంలో ప్రజలకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఆసక్తిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఆర్థిక అంశాలపై శిక్షణ అందిస్తే, భవిష్యత్తులో వారికి పెట్టుబడి పెట్టే మార్గాలపై స్పష్టమైన అవగాహన కలుగుతుందని అంచనా వేసింది.

ఈ అంశాలపై..

ఫైనాన్షియల్ లిటరీ ప్రోగ్రామ్ ఫర్ డిగ్రీ కాలేజీ స్టూడెంట్స్ పేరుతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. శిక్షణలో భాగంగా తొలిదశలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల నుంచి ఇద్దరు చొప్పున అధ్యాపకులను ఎంపిక చేసి ఐఐఎంలో శిక్షణ ఇస్తారు. దీనిని ట్రైన్ ద ట్రైనర్ మాడ్యుల్‌లో నిర్వహించనున్నారు. వీరిద్వారా కాలేజీల్లోని విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ రెండు దశల్లో ఉంటుంది. మొదటిదశలో ఆర్థికఅంశాలపై శిక్షణ ఇచ్చి, అనంతరం పరీక్ష నిర్వహిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను ఐఐఎం పర్యవేక్షిస్తుంది. ఇందులో భాగంగా మార్కెట్ ఫంక్షనింగ్, రిస్క్, రిటర్న్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా స్టాక్‌మార్కెట్, బాండ్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఫారెన్ ఎక్స్ఛేంజ్, క్రిప్టో కరెన్సీపై అవగాహన కల్పిస్తారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టడం, లాభాలను ఆర్జించడంలో మెలకువలు తెలుస్తాయని ఏఎంఎఫ్ఐ భావిస్తోంది. తద్వారా భవిష్యత్తులో మనదేశం బలమైన ఆర్థికవ్యవస్థగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వచ్చే నెల 13 నుంచి అధ్యాపకులకు శిక్షణ ప్రారంభిస్తామని ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు. దీనివల్ల సురక్షితమైన పెట్టుబడులు పెట్టే మార్గాలు తెలుస్తాయని ఫైనాన్షియల్ లిటరీ ప్రోగ్రామ్ ఫర్ డిగ్రీ కాలేజీ స్టూడెంట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విజయభాస్కర్ మారిశెట్టి తెలిపారు. ఏటా20వేల మంది విద్యార్థులకు శిక్షణ అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు.

రెవెన్యూ క్రీడల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



క్రికెట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన విశాఖపట్నం జట్టు



టగ్ ఆఫ్ వార్ మహిళా రన్నరప్‌గా నిలిచిన విశాఖ జట్టు

అనంతపురంలోని ఆర్డీటీ మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు ఆదివారం ముగిశాయి. విజేత జట్లకు రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి సత్యప్రసాద్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, ఎంపీలు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు.

భవనం పైనుంచి పడి నిర్మాణ కార్మికుడి మృతి

ఎంవీపీ కాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ స్టేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పై నుంచి పడిపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ జి.సత్యం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం, అర్జునవల ప్రాంతానికి చెందిన నవగొట్ట నాగరాజు (49) కొమ్మాది ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. నగరంలోని ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులో నిర్మాణంలో ఉన్న భవనంలో కూలి పనులు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పనిలోకి వెళ్లిన నాగరాజు అయిదో అంతస్థులో పని చేస్తుండగా,అక్కడ విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. వెంటనే విమ్స్ కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26 కిలోల గంజాయి పట్టివేత

వికారాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో 26 కేజీల గంజాయి పట్టుబడింది. విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లలో గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారంతో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆదివారం నిఘా ఉంచింది. రైల్వే ఆసుపత్రి పరిసరాల్లో అనుమానాస్పదంగా మూడు బ్యాగులు కన్పించాయి. వాటి చుట్టుపక్కల ఎవరూ లేక పోవడంతో పరిశీలించగా బ్రౌన్‌టేప్‌తో చుట్టిఉన్న 13 ప్యాకెట్లు దొరికాయి. వాటిలో మొత్తం 26 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు.

శిష్ట కరణాలు ఐక్యతతో ముందుకు సాగాలి

- మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షుడు మంత్రి శ్యామ్‌ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శిష్టకరణాలు అంతా ఐకమత్యంగా ఉండాలని, ఐకమత్యంగా ఉంటే అన్ని రంగాల్లో ముందుకు సాగగలమని మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షుడు మంత్రి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం ముడసర్లోవ పార్కులో సీతమ్మధార శిష్టకరణం అసోసియేషన్‌ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీ వనసమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ఐక్యతతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ అసోసియేషన్ క్రమశిక్షణాయుత నిర్వహణతో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుండడంఅభినందనీయం అన్నారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు గొడబ ప్రభాకర్‌దాస్, కార్యదర్శి కోటిపాం రామ్‌శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 250 కుటుంబాలు పాల్గొని సందడి చేశాయి. సంఘం వ్యవస్థాపక గౌరవాధ్యక్షుడు కుప్పిలి కరుణకుమార్, బీజేపీ మహిళా నాయకురాలు గొడబ ప్రేమకుమారి, గుమ్మ గాంధీ కృష పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ది గర్ల ఫ్రండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 48, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 50, బీరకాయలు 60, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 58, దొండకాయలు 42, బంగాళ దుంపలు 19,అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 64, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

టీకాలతో ఆరోగ్యానికి రక్ష

- పుట్టిన చిన్నారి నుంచి వృద్ధుల వరకు అందుబాటులో అనేక వ్యాక్సిన్లు
- సకాలంలో తీసుకోవడం ద్వారా వివిధ వ్యాధులకు చెక్
- అవగాహన లేమి, అపోహలతో వ్యాక్సిన్లకు దూరంగా ప్రజలు
- నేడు అంతర్జాతీయ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం



విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో వ్యాక్సిన్లు కీలక పాత్ర పోషిస్తాయి. సకాలంలో వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. కానీ ప్రజలకు సరైన అవగాహన లేమి వల్ల దూరంగా ఉంటున్నారు. ఏటా నవంబరు 10న అంతర్జాతీయ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రతిఒక్కరికి ఇమ్యునైజేషన్ చేయడం సాధ్యమే అన్న థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

టీకాలతో ఎంతో మేలు..

టీకాలను సకాలంలో తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఇన్‌ఫ్లూయెంజా, న్యుమోనియా, హెపటైటిస్, టైటనస్ వంటి తీవ్రమైన వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు అనేక వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కరోనా నుంచి ప్రజలను రక్షించడంలో వ్యాక్సిన్లు కీలక పాత్ర పోషించాయి. ప్రపంచ వ్యాప్తంగా గణనీయంగా పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ నుంచి మహిళలను కాపాడేందుకు ప్రస్తుతం హెచ్‌పీవీ వ్యాక్సిన్లు అందుబాటులోకి ఉన్నాయి.

ఇవీ టీకాలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రకాల టీకాలను ఉచితంగా అందిస్తున్నాయి. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి చిన్నారికి ఐదేళ్లు వచ్చేవరకు వివిధ రకాల వ్యాక్సిన్లను అందిస్తోంది. అలాగే వైరల్ జ్వరాలు, న్యుమోనియా, హెపటైటిస్ వంటి వ్యాధులకు దూరంగా ఉండేందుకు ప్రైవేటు వ్యాక్సిన్లు ఉన్నాయి. టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఇవి శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచి, వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లపై పోరాడుతాయి. ఒక్కోసారి టీకాలు తీసుకున్నప్పటికీ వ్యాధుల బారినపడే అవకాశం ఉంటుంది. అయితే, దాని తీవ్రత చాలా స్వల్పంగా ఉంటుంది.

నిర్లక్ష్యం వద్దు

\- డాక్టర్ బి లూసీ కార్డీలియా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి



ప్రభుత్వం అందించే అన్ని రకాల వ్యాక్సిన్లను ప్రజలు తీసుకోవాలి. ముఖ్యంగా గర్భిణిలు, బాలింతలు, వృద్ధులు వీటిపై అవగాహన పెంచుకోవాలి. కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తున్నారు. వీటిని ప్రతిఒక్కరూ తీసుకోవాలి. వ్యాధి వచ్చిన తరువాత ఇబ్బంది పడడం కంటే.. వ్యాధి రాకుండా వ్యాక్సిన్లు తీసుకోవడం మంచిది. జిల్లాలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కేజీహెచ్, ఇతర ఆస్పత్రుల్లో అనేక రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

సాగర తీరంలో కార్తీక సందడి

- సందర్శకుల తాకిడితో కోలాహలంగా తీరం
- ఆటపాటలతో పిల్లాపాపలు

బీచ్ రోడ్డు, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్ ఆదివారం సందర్శకులతో నిండిపోయింది. కార్తీక మాసం రావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఎటు చూసినా సందడేసందడి కనిపించింది. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు కోలాహలంగా మారాయి. సాయంత్రం వరకు ఉల్లాసంగా పిల్లాపాపలతో గడిపారు. ఆర్కే బీచ్‌కు నగరం నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో సందర్శకులు ఎక్కువగా వస్తున్నారు. దీంతో సాగర తీరం జన తాకిడితో కార్తీక శోభను సంతరించుకొంది. బీచ్ వద్ద ఉన్న ప్రైవేటు హోటల్స్‌కు కూడా విపరీతమైన గిరాకీ ఏర్పడింది. విహార యాత్రంలో భాగంగా ఎక్కువగా సందర్శకులు సముద్రంలో స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పోలీసులు ముందస్తు చర్యగా సముద్రంలో స్నానాలకు దిగవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎటువంటి అవాంతర సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలను మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి.

ఆరిలోవ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మూడో ఆదివారం, వన భోజనాల సందడితో ఆదివారం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల సందర్శకులతో కిటకిటలాడింది. జూలో ఎక్కడ చూసినా సందడి కనిపించింది. సుమారు 7 వేల మంది సందర్శకులు జూ పార్కుకు విచ్చేశారు. వీరి నుంచి సుమారు రూ.6.07 లక్షల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

జూకు కుటుంబాలతో వచ్చిన సందర్శకులు రోజంతా ఆటపాటలతో సరదాగా గడిపారు. వన భోజనాలు చేశారు. ఆహ్లాద వాతావరణంలో ఆనందంగా గడిపారు.


సందర్శకులతో కిక్కిరిసిన ఆర్కే బీచ్


జూ పార్కు మోటుల వద్ద జంతువులను సెల్‌ఫోన్లతో ఫొటోలు తీస్తున్న సందర్శకులు


చెట్టు ఊడలు ఊగుతూ చిన్నారుల ఉత్సాహం

టీడీపీ 16వ వార్డు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. హెచ్‌బీ కాలనీ రజకవీధి భానునగర్ వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొట్టా వెంకటరమణ పాల్గొని నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. నూతనంగా ఎన్నికైనా సభ్యులంతా పార్టీ కట్టుబడి ఉండటమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తామన్నారు. తమకు ఈ పదవులను అప్పగించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ 16వ వారు అధ్యక్షుడుగా ముగడ వాసు, కార్యదర్శిగా కోట్ల శ్రీను, తెలుగు యువత అధ్యక్షుడుగా మధురవాడ అప్పారావు, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఇప్పటి వరకూ వార్డు అధ్యక్షుడిగా కొనసాగిన నారు గోపికి వార్డు క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించారు. కార్యక్రమంలో టీడీపీ తూర్పు నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, సీనియర్ నాయకులు ఈగల సత్యం, ఐటీడీపీ ఇన్‌చార్జి పల్లా బాబు, మొల్లి శంకర్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లిటరరీ ఫెస్ట్‌లో సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు


ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో గల హవామహల్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్‌కు చినగదిలి మండలంలోని సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. అక్కడ నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ పిల్లల ఊహా శక్తిని, వారిలో ఉన్న అంతర్గత ప్రతిభాపాటవాలకు వెలికి తీయడానికి ఇటువంటి ఫెస్ట్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భాను కోటి, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి పదిగంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి ఎన్ఏడీ వైపు వెళ్లేందుకు షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద మలుపు తిరుగుతుండగా అదే దిశలో ఎన్ఏడీ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనదారుని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. సంఘటన స్థలంలో వివరాలు లభ్యం కాలేదు.

పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి వివరాలను సేకరిస్తున్నారు.

వన భోజనాల నెపంతో శివాజీ పార్కులో జూదం జోరు

ఎంవీపీ కాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శివాజీ పార్కులో జోరుగా జూదం సాగుతోంది. కార్తీకం సందడితో ఇక్కడకు చాలా మంది వనభోజనానికి వస్తున్నారు. ఇక్కడకు వచ్చే బృందాల్లో కొందరు పిక్నిక్ పేరిట జూదానికి తెర తీస్తున్నారు. భారీగా సొమ్ములు చేతులు మారుతున్నాయి. చిన్నస్థాయిలో జరుగుతున్నా ఇటీవల కాలంలో పోలీసులు ఎక్కడికక్కడ దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. అలాంటిది బహిరంగంగా పార్కులోనే బృందాలుగా జూదం ఆడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మరి కొందరు చాటుగా మద్యం సేవిస్తుండడంతో ఏవైనా ఘర్షణలు జరిగే ప్రమాదం కొట్టిపారేయలేమని సందర్శకులు అంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు ఎక్కువగా ఈ కార్తీకమాసంలో పిక్నిక్‌కు వస్తుంటారు. మహిళలు వీరిని చూసి భయపడుతుండగా, పిల్లలపై కూడా ఎంతో కొంత ప్రభావం చూపే పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఇక్కడ బహిరంగ మద్యపానం, జూదం వంటివి జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.


జూదం ఆడుతున్న యువకులు

గౌరీశంకర ఆలయంలో అన్నసమారాధన

ఆరిలోవ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులో గల కైలాసనగర్‌లో వెలసిన గౌరీశంకర ఆలయంలో ఆదివారం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 11వ ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు పాల్గొని భక్తులకు వడ్డించారు. ప్రతి సంవత్సరం కార్తీక మూడో ఆదివారం అన్న అన్న సమారాధన చేయడం సంప్రదాయంగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. సుమారు 2000 మంది భక్తులు అన్న ప్రపసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేటరింగ్ గంగ రాజు. కూటమి నాయలకు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

కొమ్మాది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పీఎంపాలెం సీఐ బాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం పీఎంపాలెం ఎస్ఐ కె. భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మారికవలస వద్ద మామిడితోటలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఎవరు పేకాట, జూదం వంటివి ఆడినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

నడకతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యం

- నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ బాలమోహన్‌దాస్

పెదవాల్తేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డు వుడా పార్కులో ఆదివారం ఉదయం షీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ బాలమోహన్‌దాస్ పాల్గొని మాట్లాడుతూ నడకలు రకాలు వాటి ప్రయోజనాల గురించి వివరించారు. ఉదయం, సాయింత్రం వాకింగ్ చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలు, వ్యత్యాసాలు ఉంటాయని తెలిపారు. అలాంటి సమస్యలు లేనప్పుడే వార్మింగ్ అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యనికి మంచిదని తెలిపారు. సమస్యలు మొదలైన తర్వాత వాకింగ్ చేయడం ద్వారా సమస్యలు అదుపులో ఉంచుకోగలమని అన్నారు. అనంతరం సోమేశ్వర రావు అతని బార్య ఉషారాణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ ఎం. వెంకట్రావు, వి కన్వెన్షన్ సెంటర్ అధినేత పీవీ జీకే మూర్తి, ఆచార్య బాలమోహన్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జి తిరుపతి రావు, డాక్టర్ పెద్ద సోములు, కోశాధికారి భీమారావు, కలిసి ఈ నెలలో వివాహాలు చేసుకునే వారిని ఘనంగా సన్మాన కార్యక్రమాలు చేపట్టారు.

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ


అంబలం పూజలో పాల్గొన్న వెలగపూడి ప్రతాప్‌రుద్ర, టీడీపీ నాయకులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి అంబలం పూజను 17వ వార్డు పరిధిలోని ఆదర్శనగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర విచ్చేశారు. తెలుగుదేశం నాయకుడు కాళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఈక్వూ ఫర్ పీస్' వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణవీర్


కృష్ణవీర్ అభిషేక్

సిరిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని ఈక్వూ ఫర్ పీస్ వరల్డ్ వైడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా విశాఖకు చెందిన డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ మాట్ పెరెల్ స్టెయిన్ అధికారికంగా సమాచారం ఇచ్చినట్లుగా కృష్ణవీర్ ఆదివారం వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా యువతలో సానుకూల మానసిక ఆరోగ్యం, భావోద్వేగ మేధస్సు , కోపం లేని జీవనం, అంతర్గత శాంతిని ప్రోత్సహించడానికి ఈక్వూ ఫర్ పీస్ సంస్థ పనిచేస్తోందని కృష్ణవీర్ అభిషేక్ తెలిపారు. డాక్టర్ కృష్ణవీర్ ఆంధ్ర యూనివర్సిటీతో పాటు వివిధ విద్యాలయాల్లో విద్యార్థుల అభ్యున్నతి, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈక్వూ ఫర్ పీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రపంచ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించడం పట్ల కృష్ణవీర్‌ను పలువురు అభినందించారు.

4న గీత ఉపకులాల వన భోజన వేడుక


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కౌన్సిల్ సభ్యుడు గిరిబాబు

వెంకోజీపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గీత ఉపకులాలు (శెట్టి బలిజ, యాత, గౌడ, శ్రీశయన, ఈడిగ) ముఖ్య నేతల సమావేశం వెంకోజీపాలెంలోని ఉడా కల్యాణమండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘం సభ్యులు, జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు మాట్లాడుతూ జనవరి 4న ముడసర్లోవ పార్కులో నిర్వహించబోయే వనసమారాధన, పరిచయ వేదికలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వనసమారాధనకు సంబంధించి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో విశ్రాంత న్యాయమూర్తి బొక్కా సత్యనారాయణ, 15వ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య మాజీ సింహాచలం బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాస్, కట్టా మల్లేశ్వరరావు, పిల్లి జయరాం, అత్తిలి శంకర్, కొప్పిశెట్టి కనక శేఖర్ ,వాసంశెట్టి శ్రీనివాసరావు, కృష్ణగౌడ్ ఇంకా పలువురు పెద్దలు మాట్లాడుతూ తమ అభిప్రాయాలను తెలియజేశారు. చెల్లుబోయిన గోవింద్, నరాల సత్తిబాబు, సంపంగి మంగరాజు పాల్గొన్నారు.

రైల్వే జోన్‌కు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రైల్వే జోన్‌కు సంబంధించిన పూర్తిస్థాయి కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం విడుదల చేసేలా చూడాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడుకు సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం లేఖ రాశారు. ఈమేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే జోన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని, ఇప్పటికే జోల్ ఆఫీస్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మంజూరు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు సమక్షంలో ప్రధాని మోదీ పునాది రాయి కూడా వేశారని పేర్కొన్నారు. జోన్ పూర్తిస్థాయి కార్యకలాపాల నిర్వహణకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై స్పందించాలని యూనియన్ నాయకులు కోరారు.

త్వరలో నైట్ బజార్ : ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నైట్ షిఫ్ట్ విధులు నిర్వహించే వారి కోసం త్వరలో నైట్ బజార్ ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మధురవాడలోని దుర్గాదేవి థియేటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను (ప్రైవేటు సంస్థ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14, 15వ తేదీల్లో నగ రంలో పారిశ్రామిక పెట్టుబడుదారుల సదస్సు జరగనుందని, దీనికి దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. వారికి మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, హస్త కళలు, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ చీరలు, బెంగాల్ కాటన్ సిల్క్స్ జైపూర్ బెడ్ షీట్స్ వంటి వస్తువులను ప్రదర్శనల ద్వారా తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మొల్లి లక్ష్మణరావు, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

12న నియోజకవర్గాల్లో వైసీపీ ర్యాలీలు

మద్దిలపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు నిరసనగా పార్టీ ఆదేశాల మేరకు వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 12 అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించానున్నట్టు వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తెలిపారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా చేపట్టబోయే ఈ కార్యక్రమాన్ని పోలీసులు గొంతునొక్కే విధంగా చర్యలు తీసుకోకూడదని కోరారు. కార్పొరేట్ సంస్థలతో చేతులు కలిపి మెడికల్ కళాశాలను ప్రైవేటుకు ధారదత్తం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట పడిగాపులు



మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీ బస్టాపు దగ్గర ఇదీ పరిస్థితి

» విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బస్టాపుల నిర్మాణానికి మోక్షమెప్పుడో..!?

మురళీనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఆర్టీసీ ప్రయాణికులకు నీడ కరువవుతోంది. ఇటు హైవే రోడ్డు జాతీయ రహదారిలోనూ, ఎగువ మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీ, సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు వరకు బస్టాపుల నిర్మాణం ప్రతిపాదనే లేదు. కొత్తగా మాధవధార నుంచి సీతమ్మధార వరకు రూ.9 కోట్లతో నవీకరించిన 60 అడుగుల రోడ్డులో బస్టాపులు ఎందుకు కట్టారో జనానికి అంతుపట్టడం లేదు. ఈ రూట్‌లో 48ఎ ఆర్టీసీ బస్సు ఒక్కటే ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9.45 గంటల వరకు ప్రతి 15 నిమిషాలకు అందుబాటులో ఉంటుంది.

దాతలు కట్టిన షెల్టర్లే దిక్కు

మాధవధార 48ఎ బస్ రూట్‌లో మొత్తం 8 సర్వీసులు అందుబాటులో ఉండడం ప్రయాణికులకు ఊరట కలిగిస్తోంది. హైవే రోడ్డు నుంచి ఎగువన కొండ సమీప నివాసితులకు దిగువ ఎస్‌ఏడీ కొత్త రోడ్డు నుంచి ఆర్అండ్‌బీ, ఊర్వశిజంక్షన్ దాటి నగరం వైపు వెళ్లే బస్సులేవీ పైరోడ్డుకి చేరవు. దీంతో ఒక్క 48ఎ బస్సు మాత్రమే ఆధారం. అందువల్ల అక్కడే బస్సుల కోసం పడిగాపులు కాస్తారు. మాధవధార ఉడాకాలనీ చివరి బస్టాపు నుంచి మురళీనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు వరకు జీవీఎంసీ షెల్టరే లేదు. మాధవధార, ఉడాకాలనీలో దాతలు కట్టిన రెండు షెల్టర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. దాదాపు 7 బస్టాపులకు ఈ రెండు మాత్రమే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు షెల్టర్ల ఊసే మరిచిపోయారు. బస్సులు నిలిపే స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. దూసుకెళ్తున్న వాహనాల రాకపోకల మధ్యనే ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించవలసి వస్తోంది.

మహిళలకు అవస్థలు

మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం లభిస్తున్నా, బస్సుల కోసం వేచి ఉండేందుకు షెల్టర్ల సమస్య ఉంది. ఉదయం వేళ విద్యార్థులు, ఉద్యోగినులు సహా అన్నివర్గాల వారు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో బస్టాపులు లేక ఎక్కడ చూసినా మహిళలే అవస్థల ప్రయాణం చేయాల్సి వస్తోంది. విశాలమైన మురళీనగర్ రోడ్లపై వాహనాలు ఎక్కడ అదుపు తప్పి మీదకొస్తాయో తెలియని అభద్రతలోనే గడుపుతున్నారు. నాలుగు రోడ్ల కూడలిగా ఉన్న ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు హైవే బస్టాప్‌లోనూ షెల్టరు ఉండదు. బిర్లా జంక్షన్‌లోనూ, కంచరపాలెం వైపు ప్రయాణించే వారికి చెట్లనీడే ఆదరవు. కొన్ని ప్రాంతాల్లో రెండేసి షెల్టర్లు నిర్మించడం ప్రణాళికాలోపానికి నిదర్శనం. మాధవధార - కైలాసపురం, దిగువ హైవేలోనూ షెల్టర్ల నిర్మాణం ఊసే లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వాతావరణంలో మార్పుల ప్రభావం వల్ల ఏడాదిలో ఎక్కువ రోజులు ఎండలు మండిపోతున్నాయి. ఎండా, వానలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు అవసరమైనచోట బస్ షెల్టర్లు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మాధవధార కళింగనగర్ బస్టాపులో నీడ కరువు

బీచ్‌రోడ్డుకు సొబగులు



ఆర్కేబీచ్‌లో హైమాస్ట్ లైట్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

... 5వ పేజీ తరువాయి

హాజరయ్యే ప్రతినిధుల కోసం 800కి పైగా కార్లు అందుబాటులో ఉంచాలని రవాణాశాఖ అధికారులకు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీచేసింది. ఇందులో 600 ఇన్నోవా, వందకుపైగా ఫైవ్‌సీటర్ సెడాన్‌కార్లు, సదస్సుకు హాజరయ్యే ప్రముఖులు, పారిశ్రామికవేత్తల కోసం 30 బెంజ్‌లు, 30 బీఎండబ్ల్యూ కార్లు కావాలని ఇండెంట్‌పంపింది. వీటితోపాటు 15 బస్సులు, వీఐపీల కాన్వాయ్ కోసం 50 వరకు అదనపు కార్లు అవసరమని భావిస్తున్నారు. ఈమేరకు వాటిని సమకూర్చుకోవడంలో రవాణాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

ఇన్నోవా, సెడాన్‌కార్లు నగరంతోపాటు అనకాపల్లి, విజయనగరం జిల్లాలోని ట్రావెల్స్ నిర్వాహకుల వద్ద అందుబాటులో ఉన్నప్పటికీ, బెంజ్, బీఎండబ్ల్యూ కార్ల కోసం వెతుకుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఉభయ గోదావరి, విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి వాటిని సమకూర్చుకోవడంపై దృష్టిసారించారు. ఎయిర్‌పోర్టులో దిగిన ప్రతినిధులను కేటాయించిన హోటళ్లకు, అక్కడి నుంచి సదస్సు జరిగే ప్రాంగణానికి తీసుకెళ్లడం కోసం కార్లను కేటాయిస్తున్నారు. సదస్సుకు ముందురోజు అంటే 13 నుంచి 15 వరకు కార్లను అద్దె ప్రాతిపదికన సమకూర్చుకుంటున్నట్టు రవాణాశాఖ ఉపకమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

'పావనమూర్తి సేవలు మరువలేం'



మాట్లాడుతున్న బౌద్ధ భిక్షువు మిత్మానంద

సీతమ్మధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ భవన్‌లో పావనమూర్తి సంస్మరణ సభను బుద్ధిస్ట్ సంప్రదాయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన సేవలను ఎప్పటికీ మరువలేమని పలువురు కొనియాడారు. బౌద్ధ భిక్షువు మిత్మానంద బాంతేజీ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, ఐపీఎస్ అధికారి మోక సత్తిబాబు తదితరులు పాల్గొని పావనమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అంబేడ్కర్ భావజాలానికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పలు దళిత, బహుజన ప్రజాసంఘాల నాయకులు సి.ప్రజ్ఞ, భీంజీ, రాంజీ, అంబేడ్కర్, జెవ ప్రభాకర్, మల్లయ్య రాజు పాల్గొన్నారు.

బాక్సర్ సాయి లోహిత్‌కు సత్కారం



సాయి లోహిత్‌ను అభినందిస్తున్న సంపంగి శ్రీనివాస్

సీతంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాక్సింగ్ పోటీల్లో 46-48 కేజీల విభాగంలో మైక్ బాక్సింగ్ క్లబ్‌కి చెందిన కె.సాయి లోహిత్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా సీతమ్మధార పీఅండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్ మైదానంలో మైక్ బాక్సింగ్ క్లబ్ స్పాన్సర్ సంపంగి శ్రీనివాస్ బాక్సింగ్ కిట్ ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైక్ బాక్సింగ్ క్లబ్ హెడ్ కోచ్ హరీష్, కోచ్ దీనిష్, చిత్రానంద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.40 వేల విలువైన ఎనిమిది కేజీల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన ప్రశాంత్ చిన్నాదురై ఒడిశా నుంచి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

రెవెన్యూ క్రీడల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



క్రికెట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన విశాఖ జట్టు



టగ్ ఆఫ్ వార్ మహిళా రన్నరప్‌గా విశాఖ జట్టు

అనంతపురంలోని ఆర్డీటీ మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు ఆదివారం ముగిశాయి. విజేత జట్లకు రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, ఎంపీలు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం, ఆదిత్య చెస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ ఆదివారం ముగిసింది. నవోదయ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 222 మంది క్రీడాకారులు పాల్గొని ఏడు రౌండ్లలో హోరాహోరీగా పోటీపడ్డారు. ఓపెన్ కేటగిరీలో తొలి ఐదు స్థానాలలో నిలిచిన క్రీడాకారులు త్వరలో విజయవాడలో జరగనున్న 800లోపు రేటింగ్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్నారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి పెనుమత్స శ్యామల దీపిక, బి.శెట్టిరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఓపెన్ కేటగిరీలో వెంకటేశ్వరరావు వెంపర్ల, బలగా భాస్కరరావు, కృష్ణ వరన్య పొట్నూరు, సుధీర్‌కుమార్, ఎవిఎస్.విజయ్‌కుమార్ నిలిచారు. ఏజ్ గ్రూప్‌ల పోటీల్లో తొలి మూడు స్థానాలలో నిలిచినవారిని విజయవాడలో జరగనున్న అంతర్జాతీయ టోర్నీకి ఎంపిక చేశామ

వైభవుని ఆలయాన్ని సందర్శించిన గణపతి సచ్చిదానంద



ఆలయంలో భక్తులతో సంభాషిస్తున్న స్వామీజీ

మురళీనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మైసూరు దత్తపీఠం అవధూత గణపతి సచ్చిదానంద స్వామీజీ సందర్శించారు. ఆదివారం సాయంత్రం విచ్చేసిన స్వామీజీకి ఆలయవర్గాలు శుభ స్వాగతం పలికాయి. ఆలయంలో అర్చకులు శేషస్వామి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనమిచ్చారు. ఆయనకు ఆలయ మర్యాదలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయ సన్నిధిలో గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్తులతో సంభాషించారు. భక్తితత్త్వంపై జీవన సూత్రాలు తెలియజేశారు. ఆలయ నిర్మాణదాతలు, నిర్వాహక కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హరేకృష్ణా మూవ్‌మెంట్ కార్తీక దీపోత్సవం

మహారాణిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ జంక్షన్‌లోని అంకోసా సమావేశ మందిరంలో ఆదివారం హరేకృష్ణా మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంకోసా సభ్యుల ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హరేకృష్ణా మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస అఖండ హరినామ సంకీర్తన, తులసి పూజతో ప్రారంభించారు. దీపారాధన, హారతి, దామో దర అష్టకం లయబద్ధంగా పాడుతుండగా భక్తులు నెయ్యిదీపాలు వెలిగించారు. దామోదర మాసం ప్రాముఖ్యతను వివరించారు. కార్తీక వ్రత నియమాలు, వ్యాస మహర్షి రచించిన పద్మ పురాణంలోని దామోదర అష్టకాన్ని ప్రవచనం చేసి వినిపించారు. వైద్యులు పాల్గొన్నారు.

కొనసాగిన కెనరా బ్యాంక్ జాతీయ మహాసభలు



జాతీయ మహాసభలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

సాగర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో కెనరా బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహాసభలు ఆదివారం కూడా కొనసాగాయి. రెండు రోజు పలు అంశాలపై విస్తృత చర్చలు, తీర్మానాలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జాతీ య ప్రధాన కార్యదర్శి కె. రవికుమార్ మాట్లాడుతూ 2022లో జరిగిన 19వ సదస్సు నుంచి ఇప్పటివరకు జరిగిన జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక అంశాలపై మాట్లాడారు. బ్యాంకు అధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి, వంద తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ తీర్మానాలను బ్యాంకు యాజమాన్యంతో చర్చించి సఫలీకృతం చేయడానికి కృషి చేస్తామన్నారు. సోమవారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఇతర జాతీయ కార్యవర్గం ఎన్నిక జరగనున్నట్టు వెల్లడించారు.

మాధవధారలో ఉత్సాహంగా ట్రెక్కింగ్



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న బృందం

మాధవధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతికి నెలవైన మాధవధార కొండపై ఆదివారం 'యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' విశాఖ చాప్టర్ ట్రెక్కింగ్ ఉత్సాహంగా నిర్వహించింది. ఉదయం 7 గంటలకు ఆరంభమైన ట్రెక్కింగ్‌లో నగరంలోని పలు ప్రాంతాల నుంచి 35 మంది మాధవధార కొండ నుంచి మెట్ల మార్గం ద్వారా సింహాచలం చేరుకున్నట్టు ప్రోగ్రామ్ డైరెక్టర్ చంద్రశేఖర్ పండా తెలిపారు. తొమ్మిదేళ్లు దాటిన వారి నుంచి ఆడ, మగ, పెద్దల్ని, పిల్లలను ట్రెక్కింగ్‌కు అనుమతించడంతో మెట్ల మార్గం సందడిగా కనిపించింది. ప్రకృతి సోయగాల మధ్య జాగ్రత్తలు తీసుకుంటూ సింహాచల ఆలయ ప్రాముఖ్యతను, చరిత్రను వివరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాప్టర్ ఛైర్మన్ ఎ.పుండరీకాక్ష, ఫీల్డ్ డైరెక్టరు హీరా సింగ్, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలలతో రైళ్లలో భిక్షాటన

ఆర్పీఎఫ్ అదుపులో ఇద్దరు మహిళలు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలను (ట్రాఫికర్లు) ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి బృందం అదుపులోకి తీసుకుది. రైళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టి ఛత్తీస్‌గడ్, రాయపూర్‌కు చెందిన సుధాకుమారి అలియాస్ శింత, సుఖ్‌బాయి ధాడీ అనే ఇద్దరు మహిళలను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. గుర్తు తెలియని వ్యక్తులు డబ్బు ప్రలోభపెట్టి జన్మభూమి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లలో భిక్షాటన చేయిస్తున్నట్టు విచారణలో నిందితులు వెల్లడించారు. బాలలతోపాటు అదుపులోకి తీసుకున్న మహిళలను జీఆర్పీకి అప్పగించారు. బాలలను చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రభుత్వ బాలల వసతి గృహాలకు పంపారు. ట్రాఫికర్లపై కేసు నమోదు చేసి రాయపూర్‌లోని ఖరోరా పోలీసు స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

పిల్లల ఉజ్వల భవితకు భవిత కేంద్రం సోపానం కావాలి



ధ్రువపత్రాలు అందిస్తున్న సీతారాం

అక్కయ్యపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ భవిత ప్రాజెక్టు నిర్వహిస్తున్న కేంద్రాల్లో ఆటపాటలతో విద్యనభ్యసించే పిల్లలను ఉజ్వల భవిష్యత్‌కు సోపానాలుగా నిలిపేలా ఉపాధ్యాయులు అడుగులు వేయాలని బాలల హక్కుల చైతన్య సంస్థ రాష్ట్ర కన్వీనర్ గొందు సీతారాం సూచించారు. ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లకు రెండు రోజులు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ పిల్లలకు ఉపయుక్తంగా ఉండాలన్న సంకల్పంతో పెదబాల శిక్షలోని ఎనిమిది భాగాలను ప్రామాణికంగా తీసుకొని పుస్తకాన్ని రూపొందించడం హర్షణీయమన్నారు. 30 భవిత కేంద్రాల్లో బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ, ప్రాజెక్టు అధికారి హెచ్.శంకరరావు, కో-ఆర్డినేటర్ ఆవుపాటి మోహన్ కుమార్‌లు దృష్టి సారిస్తుండడం అభినందనీయమన్నారు. సదస్సుకు హాజరైన ఉపాధ్యాయులకు, సూపర్‌వైజర్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఘనంగా ఆరుద్ర నక్షత్ర పూజలు

సీతమ్మధార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని మహాశివలింగానికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మలు మహా శివలింగానికి పంచామృతా భిషేకాలు, రుద్ర అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

విద్యాశాఖ ఆదేశించింది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలనిఎంఈవో/ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ఈనెల 25వతేదీలోగా జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తిచేసి నెలాఖరులోగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని ఆదేశించింది. జిల్లాలో సమ్మేటివ్ పరీక్షలకు సంబంధించి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో ప్రేమ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు.

పరీక్ష తేదీ మార్పునకు వినతి

డాబాగార్డెన్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న బాలల దినోత్సవం రోజున కూడా సమ్మేటివ్ పరీక్ష రాయాలనడం బాలలను ఉత్సవానికి దూరం చేయడమేనని రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. ఇది కచ్చితంగా బాలల హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, అందువల్ల ఆ రోజు పరీక్ష వాయిదా వేయాలని పాఠశాల విద్య కమిషనర్ వి.విజయకుమార్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక పాఠాలు

... 5వ పేజీ తరువాయి

ఇతర మార్గాలను అన్వేషించింది. ఈ క్రమంలో ప్రజలకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఆసక్తిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఆర్థిక అంశాలపై శిక్షణ అందిస్తే, భవిష్యత్తులో వారికి పెట్టుబడి పెట్టే మార్గాలపై స్పష్టమైన అవగాహన కలుగుతుందని అంచనా వేసింది.

ఈ అంశాలపై..

ఫైనాన్షియల్ లిటరీ ప్రోగ్రామ్ ఫర్ డిగ్రీ కాలేజీ స్టూడెంట్స్ పేరుతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. శిక్షణలో భాగంగా తొలిదశలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల నుంచి ఇద్దరు చొప్పున అధ్యాపకులను ఎంపిక చేసి ఐఐఎంలో శిక్షణ ఇస్తారు. దీనిని ట్రైన్ ద ట్రైనర్ మాడ్యూల్‌లో నిర్వహించనున్నారు. వీరిద్వారా కాలేజీల్లోని విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ రెండు దశల్లో ఉంటుంది. మొదటిదశలో ఆర్థికఅంశాలపై శిక్షణ ఇచ్చి, అనంతరం పరీక్ష నిర్వహిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను ఐఐఎం పర్యవేక్షిస్తుంది. ఇందులో భాగంగా మార్కెట్ ఫంక్షనింగ్, రిస్క్, రిటర్న్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా స్టాక్‌మార్కెట్, బాండ్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఫారెన్ ఎక్స్ఛేంజ్, క్రిప్టో కరెన్సీపై అవగాహన కల్పిస్తారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టడం, లాభాలను ఆర్జించడంలో మెలకువలు తెలుస్తాయని ఏఎంఎఫ్ఐ భావిస్తోంది. తద్వారా భవిష్యత్తులో మనదేశం బలమైన ఆర్థికవ్యవస్థగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వచ్చే నెల 13 నుంచి అధ్యాపకులకు శిక్షణ ప్రారంభిస్తామని ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు. దీనివల్ల సురక్షితమైన పెట్టుబడులు పెట్టే మార్గాలు తెలుస్తాయని ఫైనాన్షియల్ లిటరీ ప్రోగ్రామ్ ఫర్ డిగ్రీ కాలేజీ స్టూడెంట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విజయభాస్కర్ మారిశెట్టి తెలిపారు. ఏటా20వేల మంది విద్యార్థులకు శిక్షణ అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు.

వీధికుక్కలపై మల్లగుల్లాలు!

... 5వ పేజీ తరువాయి

చర్యలు తీసుకోవడంతోపాటు వాటిని బయటకు తరలించాలని ఆదేశించింది. వీధికుక్కలకు ఆపరేషన్ చేసిన తర్వాత పట్టుకున్నచోట వదలకుండా రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచాలని స్పష్టంచేసింది. మిగిలిన కుక్కలకు ఫీడింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి నీరు, ఆహారం అందజేయాలని సూచించింది.

అధికారుల తర్జనభర్జన

సుప్రీంకోర్టు ఆదేశాలు జీవీఎంసీ అధికారుల్లో కలవరం రేపుతున్నాయి. నగర పరిధిలో రెండు లక్షల వరకు ఉన్న వీధికుక్కలను రీహాబిలిటేషన్ సెంటర్లు, ఫీడింగ్ కేంద్రాలకు తరలించాలంటే పెద్ద దింత్రాంగమే అవసరమంటున్నారు. కుక్కలను పట్టుకోవడానికి సిబ్బందితోపాటు తరలించడానికి వాహనాలు సమకూర్చుకోవాలి. వాటిని ఉంచడానికి భారీగా కెన్నెల్స్‌ను కొనుగోలుచేయాలి. ఒక కెన్నెల్‌లో రెండు కుక్కలను ఉంచినా లక్ష కెన్నెల్స్ అవసరమవుతాయని, అందుకోసం విశాలమైన స్థలాన్ని గుర్తించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ దశలో దీనిపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధికారులు సమావేశమై సుప్రీంకోర్టు ఆదేశాలపై చర్చించి, ఏం చేయాలనే దానిపై నిర్ణయించే అవకాశం ఉంది.

15 వేల ఇళ్లు రద్దు?

... 5వ పేజీ తరువాయి

హయాంలోనే ప్రారంభించారు. అప్పట్లో ఇళ్ల నిర్మాణాలకు వీలులేకపోయినా అధికారులు ఇష్టానుసారంగా లేఅవుట్‌లు రూపొందించారు. కొండలపైన, గెడ్డలు, వాగులు, చెరువులు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలని చూడలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొత్తం లక్ష మందికి పట్టాలిచ్చామని అప్పటి ప్రభుత్వం గొప్పలకు పోయింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకోకుండా ప్లాట్లు వేసి లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయించారు. అదే సమయంలో ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే లేఅవుట్‌లను పరిశీలించిన కాంట్రాక్టర్లు నిర్మాణాలకు అనువుగా ఉన్న ప్లాట్లను గుర్తించారు. అక్కడే పనులు ప్రారంభించారు. నిర్మాణాలకు వీలుకాని ప్లాట్లను పక్కనపడేశారు. చాలా లేఅవుట్‌లలో ఇటువంటివి పదుల సంఖ్య నుంచి వందల వరకు ఉంటాయి. సబ్బవరం మండలం అసకపల్లిలో కొండవాలు నుంచి పైవరకు లేఅవుట్‌వేశారు. అక్కడ వాలు ప్రాంతంలోనే నిర్మాణాలు చేపట్టారు. కొండపైన ఇళ్ల నిర్మాణాలకు ప్రయత్నించి వీలుకాకపోవడంతో విడిచిపెట్టేశారు .పైడివాడ అగ్రహారం చెరువు గర్భంలో కొన్ని ఇటువంటి ప్లాట్లను వదిలేశారు. అనకాపల్లి మండలం కుంచంగి, కూండ్రంలో తొమ్మిదివేలకుగాను ఆరువేల వరకు నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికీ రోడ్డు సదుపాయం లేకపోవడంతో లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. ఆనందపురం మండలం కణమాం లేఅవుట్ గెడ్డవాగులో ప్లాట్లను వదిలేశారు. అధికారులు ఒత్తిడిచేసి నిర్మాణాలు చేపట్టాలంటే ప్రస్తుతం యూనిట్ ధర రూ. 1.8 లక్షలు సరిపోదని, మరో లక్ష వరకు ఇవ్వాల్సి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇలా సుమారు 15 వేల ఇళ్లు ఉంటాయని అధికారులు అంచనావేస్తున్నారు. ప్రస్తుతం లక్ష ఇళ్ల ప్రాజెక్టు వచ్చే ఏడాది జూన్ నెలాఖరుతో ముగుస్తోంది. అందువల్ల నిర్మాణాలకు వీలుకాని ప్లాట్లులో ఇళ్లను రద్దుచేసి వారికి మరో చోట కేటాయించాలనే ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండీ సూచన మేరకు ఇళ్ల వివరాలు తీసుకుని నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.

జాతీయ ఈత టోర్నీకి నగర క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన యశ్విత్, సమన్విత, ధృతి, జ్ఞానశ్రీ, హిమశ్రీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ టోర్నీలో నగరానికి చెందిన స్విమ్మర్లు పతకాలు సాధించడమే కాకుండా జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారని ఎస్3 స్పోర్ట్స్ వ్యవస్థాపకుడు సహాని కంచెర్ల తెలిపారు. విజయనగరంలో జరిగిన ఈ టోర్నీలో అండర్-14, 17, 19 బాలురు, బాలికల విభాగాలలో నాలుగు స్వర్ణ, నాలుగు రజత, మూడు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారన్నారు. జీవీఎంసీ అందిస్తున్న ఆధునిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చినబాబు, బార్గవ్‌ల శిక్షణలో స్విమ్మర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు: అండర్-14 బాలుర బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్‌లో యశ్విత్ 200మీ.లో స్వర్ణం, 100మీ. రజతం, 50 మీ. కాంస్య పతకం; బాలికల బటర్ ఫ్లై ఈవెంట్‌లో ఎస్.సమన్విత 100మీ., 200మీ.లో రజత పతకాలు, 50మీ.లో కాంస్య పతకం; 200మీ. ఫ్రీ స్టైల్‌లో ధృతి కాంస్య పతకం సాధించారు. అండర్-17 బాలికల 100మీ. స్టైల్ ఈవెంట్‌లో జ్ఞానశ్రీ రజత పతకం; అండర్-19 బాలికల ఫ్రీ స్టైల్ 200మీ. 100మీ., 50మీ. ఫ్రీ స్టైల్ ఈవెంట్లలో హిమశ్రీ స్వర్ణ పతకాలు సొంతం చేసుకుని నగర క్రీడారంగానికి గర్వంగా నిలిచింది.

టీకాలతో ఆరోగ్యానికి రక్ష

- పుట్టిన చిన్నారి నుంచి వృద్ధుల వరకు అందుబాటులో అనేక వ్యాక్సిన్లు
- సకాలంలో తీసుకోవడం ద్వారా వివిధ వ్యాధులకు చెక్
- అవగాహన లేమి, అపోహలతో వ్యాక్సిన్లకు దూరంగా ప్రజలు
- నేడు అంతర్జాతీయ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం



విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో వ్యాక్సిన్లు కీలక పాత్ర పోషిస్తాయి. సకాలంలో వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. కానీ ప్రజలకు సరైన అవగాహన లేమి వల్ల దూరంగా ఉంటున్నారు. ఏటా నవంబరు 10న అంతర్జాతీయ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రతిఒక్కరికి ఇమ్యునైజేషన్ చేయడం సాధ్యమే అన్న థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

టీకాలతో ఎంతో మేలు..

టీకాలను సకాలంలో తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఇన్‌ఫ్లూయెంజా, న్యుమోనియా, హెపటైటిస్, టైటనస్ వంటి తీవ్రమైన వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు అనేక వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కరోనా నుంచి ప్రజలను రక్షించడంలో వ్యాక్సిన్లు కీలక పాత్ర పోషించాయి. ప్రపంచ వ్యాప్తంగా గణనీయంగా పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ నుంచి మహిళలను కాపాడేందుకు ప్రస్తుతం హెచ్‌పీవీ వ్యాక్సిన్లు అందుబాటులోకి ఉన్నాయి.

ఇవీ టీకాలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రకాల టీకాలను ఉచితంగా అందిస్తున్నాయి. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి చిన్నారికి ఐదేళ్లు వచ్చేవరకు వివిధ రకాల వ్యాక్సిన్లను అందిస్తోంది. అలాగే వైరల్ జ్వరాలు, న్యుమోనియా, హెపటైటిస్ వంటి వ్యాధులకు దూరంగా ఉండేందుకు ప్రైవేటు వ్యాక్సిన్లు ఉన్నాయి. టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఇవి శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచి, వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లపై పోరాడుతాయి. ఒక్కసారి టీకాలు తీసుకున్నప్పటికీ వ్యాధుల బారినపడే అవకాశం ఉంటుంది. అయితే, దాని తీవ్రత చాలా స్వల్పంగా ఉంటుంది.

నిర్లక్ష్యం వద్దు

- డాక్టర్ బి లూసీ కార్డీలియా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి



ప్రభుత్వం అందించే అన్ని రకాల వ్యాక్సిన్లను ప్రజలు తీసుకోవాలి. ముఖ్యంగా గర్భిణిలు, బాలింతలు, వృద్ధులు వీటి పై అవగాహన పెంచుకోవాలి. కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తున్నారు. వీటిని ప్రతిఒక్కరూ తీసుకోవాలి. వ్యాధి వచ్చిన తరువాత ఇబ్బంది పడడం కంటే.. వ్యాధి రాకుండా వ్యాక్సిన్లు తీసుకోవడం మంచిది. జిల్లాలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కేజీహెచ్, ఇతర ఆస్పత్రుల్లో అనేక రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే 'పల్లా'కు ఆహ్వానం



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

అగనంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి మారుతి జంక్షన్‌లో కొలవైయున్న అభయాంజనేయస్వామి ఆలయం 12వ వార్షికోత్సవానికి ఆహ్వాన పత్రాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఈ నెల 11 నుంచి మూడు రోజులు పాటు జరిగే వేడులకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, ఆలయ కమిటీ ప్రతినిధులు మాదాసు వాసు, పచ్చికోరు రమణమూర్తి, మడక రమేశ్‌నాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల జీవనోపాధి దెబ్బతీయవద్దని వినతి'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఏ ఒక్కరిని విధుల నుంచి తొలగించి కార్మికుల జీవనోపాధి దెబ్బతీయవద్దని అధికారులను ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరారు. ప్లాటులో అధికారులతో కార్మిక సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఇటీవల కాలంలో కాంట్రాక్టు కార్మికులను తొలగించడం వల్ల కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్తులో ఎవరిని తొలగించరాదని, అలాగే తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు.

కార్తీక పూజలకు ఏర్పాట్లు

అగనంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో సోమవారం పూజలకు స్థానికంగా గల శివాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. పెదమడక ఉమామహేశ్వర ఆలయం, పాత అగనంపూడి లింగాల తిరుగుడి, జాబిలిహిల్స్‌లో గల ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, కర్రివానిపాలెంలో గల శివాలయాలకు భక్తుల తాడికిని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనాల కోసం వచ్చే భక్తులు క్యూ పద్ధతిని పాటించాలని నిర్వాహకులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి పది గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి ఎన్ఏడీ వైపు వెళ్లేందుకు షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద మలుపు తిరుగుతుండగా అదే దిశలో ఎన్ఏడీ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. సంఘటన స్థలంలో వివరాలు లభ్యం కాలేదు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి వివరాలను సేకరిస్తున్నారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 48, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 50, బీరకాయలు 60, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 58, దొండకాయలు 42, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 64, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంప 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

అంతర్‌రాష్ట్ర అవగాహన యాత్ర ప్రారంభం



యాత్రకు బయల్దేరిన వైహెచ్‌ఏఐ ఆంధ్రప్రదేశ్ శాఖ సభ్యులు

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :'భారత వారసత్వం-సామరస్యం' నినాదంతో యూత్‌హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైహెచ్ఏఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ సభ్యులు చేపట్టిన అంతర్‌రాష్ట్ర అవగాహనా యాత్ర ఆదివారం ప్రారంభమైంది. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ముఖ్య పోషకులు, కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ ప్రసాద్ బీచ్‌రోడ్డులో జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర శాఖ చైర్మన్ సీహెచ్ రవిపాల్, గౌరవ కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, కోశాధికారి ఇ.శ్రీనివాసరావు, పూర్వపు చైర్మన్ బి.ఉమామహేశ్వరరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కేవీ రాజు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ యాత్ర సాగుతుందని, చారిత్రక దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, వారసత్వ ప్రాంతాలను సభ్యులు సందర్శించనున్నారు. విశాఖలో సింహాచలం, రుషికొండలోని బాలాజీ ఆలయం, శ్రీకాకుళంలోని అరసవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆలయం, కూర్మనాథ ఆలయం, శ్రీముఖలింగం ఆలయాలను సందర్శించి ఈ బృందం ఒడిశాలోని చిల్కా చేరుకుంటుంది. చిల్కా సరస్సులోని కాళీమాత ఆలయం, పూరిలోని జగన్నాథుని, కోణార్క్‌లోని సూర్యదేవాలయం, అనంతరం భువనేశ్వర్‌లో లింగరాజస్వామి ఆలయం దర్శించుకొని అనంతరం వెనుదిరిగి ఈ బృందం విశాఖ చేరుకొంటుంది. ఈ ప్రతినిధి బృందంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాల ప్రతినిధులు ఉన్నారు.

99 జంటలకు సామూహిక షష్టి పూర్తి మహోత్సవం



షష్టి పూర్తి మహోత్సవంలో పాల్గొన్న జంటలు

కూర్మన్నపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు కణితిలో వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 99 జంటలకు సామూహిక షష్టి పూర్తి మహోత్సవం కన్నుల పండువుగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఆంధ్ర, కర్నాటక, తెలంగాణా, చెన్నై నుంచి పెద్ద ఎత్తున వృద్ధ దంపతులు విచ్చేసినట్టు ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య ఐవీఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శి కారుమూరి మహేష్ తెలిపారు. సంకటహర చతుర్థి ఆరుద్ర నక్షత్రంను పురస్కరించుకొని చేపట్టిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పెనుగొండ వాసవీ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రవచనాలను బోధించారు.

కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎం.వెంకటరమణ, మధుసూదన శెట్టి, కె.సుజాత, సంధ్యారాణి, రత్నమాల, చంద్రకళ, కె.రాజేష్, నర్సింగరావు, రామకృష్ణ,వెంకట్రావు, సతీష్, కిషోర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల ఐక్యతతో ప్రగతి సాధ్యం



మేయరు పీలా, ఎమ్మెల్యే పంచకర్లను సత్కరిస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

పెందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంఘాల ఐక్యతతో ప్రగతి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తిలో గల గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గవర కులస్తులు కార్తీక వన భోజన సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ గవర కులస్తులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నగర మేయరు పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబులను గౌరీ సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వన సమారాధనలో ఆటపాటలతో సందడి నెలకొంది. సంఘం అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, సంఘం మాజీ అధ్యక్షులు ఆళ్ల సత్తిబాబు, శరగడం నర్సింహమూర్తి, ఆళ్ల రాము పాల్గొన్నారు.

నేడు గాజువాక డంపింగ్ యార్డుపై చర్చ

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గాజువాకలోని డంపింగ్‌యార్డు ఆధునికీకరణ కోసం ఇంజనీరింగ్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలపై విజయవాడలో సోమవారం చర్చలు జరగనున్నాయి. గాజువాక డంపింగ్ యార్డులో 2019లో క్లోజ్డ్ కంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) ప్రాజెక్టు నిర్వహణలో కాంట్రాక్టర్ విఫలం కావడంతో యార్డులో చెత్త నిల్వ ఉండిపోతోంది. దీనివల్ల స్థానికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఇటీవల యార్డును సందర్శించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన అధికారులను వివరణ కోరగా కాంట్రాక్టర్ వైఫల్యాన్ని దాచిపెట్టి, యార్డుకు ఎక్కువ చెత్త వస్తోందని, కాపులుప్పాడలోని యార్డుకు అంత చెత్తను తరలించలేకపోతుండడంతో నిల్వ ఉండిపోతోందన్నారు. చెత్త తరలింపునకు సీసీఎస్ ప్రాజెక్టు యంత్రాలను రిపేర్లు చేయించడంతో పాటు రేకుల షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని వివరించారు. సోమవారం విజయవాడ వచ్చి ప్రతిపాదనలను వివరించాలని పట్టాభిరామ్ అధికారులను ఆదేశించారు.

ఘనంగా అన్నసమారాధన

మల్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనతాకాలనీ శివారులో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత బ్రహ్మంగారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక మంది పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధి పుట్టా గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో పాల్గొన్న కోరమాండల్ కంపెనీ అధికారులు

మల్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని కోరమాండల్ ఎరువుల కర్మాగారం వైస్ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, విశాఖపట్నం హెడ్ కేవీవీవైఎస్ నారాయణరావులు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 58వ వార్డు గొందేశివానిపాలెంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. పారిశ్రామిక ప్రాంతంలో అన్ని వర్గాలవారికి పది రూపాయలకే వైద్యసేవలు అందిస్తున్నామని కంపెనీ అధికారులు పేర్కొన్నారు. ఈ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. దాదాపు 200 మందికి వైద్యసేవలు, మందులు అందించామని తెలిపారు. కంపెనీ అధికారులు నారాయణ పాత్రుడు, శ్రీకాంత్, వెంకటరమణతో పాటు గొందేశివానిపాలెం గ్రామ పెద్దలు గొందేశి గోవింద్, గొందేశి మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గణబాబు హామీ



మర్రిపాలెం రైతుబజారులో వెనుక ఖాళీస్థలంను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం రైతుబజారులో పార్కింగ్, అదనపు స్టాల్స్ నిర్మాణం తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ప్రభుత్వ విప్ గణబాబు పేర్కొన్నారు. మార్కెటింగ్ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఆయన ఆకస్మికంగా రైతుబజారును సందర్శించారు. లోపల స్టాల్స్, సూపర్‌బజారు కౌంటర్‌లో అందుతున్న సబ్సిడీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు, కొందరు కొనుగోలుదారులతో మాట్లాడారు. రైతుబజారుకు రాకపోకల మార్గం, బయట తోపుడు బండ్ల నిర్వహణ, వెనుక ఖాళీస్థలంలో అదనపు స్టాల్స్ నిర్మాణానికి త్వరలో ప్రణాళికలు తయారు చేయించి విక్రయాలు సాయంత్రం వరకు జరిగేలా చూస్తానని గణబాబు హామీ ఇచ్చారు. మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఎలమంచిలి అపర్ణ, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్ మహంతి, డైరెక్టర్లు సుభాని లలిత, రమాబాయి, లత జగదీశ్వరి, నాగేశ్వరరావు, శివ, వార్డు అధ్యక్షుడు వై.టి.ఆర్.ఎలమంచిలి ప్రసాద్‌వర్మ, ఎస్టేట్ అధికారి నరసింహమూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కుకు బెంచీల వితరణ

సింధియా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా హిందుస్థాన్ షిప్‌యార్డు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సభ్యుల అధ్వర్యంలో ఆదివారం విశాఖ ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కుకు 12 సిమెంట్ బెంచీలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సభ్యుల్లో ఒకరైన రిటైర్డ్ హెడ్ మాస్టర్ గజపతి రాజు వర్మా మాట్లాడుతూ.. వన్యప్రాణులు, పర్యావరణ సమతుల్యత గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పారావు, డాక్టర్ జీటీ రమేష్, హిందుస్థాన్ షిప్‌యార్డు కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అందరి ప్రగతికి చేయూత అందించాలి

- అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ సీజీఎం ఉర్లాం జయమన్మథరావు



కార్తీక వనమహోత్సవంలో పాల్గొన్న అమరావతి జయమన్మథరావు, శిక్షకరణ సంఘం ప్రతినిధులు

వేపగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉంటే అందరి కుటుంబాల సంక్షేమానికి కృషి చేయాలని అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ సీజీఎం ఉర్లాం జయమన్మథరావు సూచించారు. సింహాచలం గోశాల దరి శ్రీనివాసనగర్ మామిడితోటలో ఆదివారం శిష్టకరణం రైల్వే ఎంప్లాయిస్, రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన్మథరావు మాట్లాడుతూ ఉద్యోగులు తమ బాధ్యతలను నిర్వహిస్తూనే సామాజిక సేవ చేయాలన్నారు. మనం ఎదుగుతూ పక్కవారికి చేయూత ఇవ్వటం కూడా ఎంతో అవసరమన్నారు. శిష్టకరణ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, రైల్వేలో అవార్డులు పొందినవారిని సన్మానించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.కె.పట్నాయక్, పాత్రో సుధీర్, ఆర్.పి.రమేష్ పట్నాయక్, ఆనందరావు, సంఘం అధ్యక్షుడు పక్కి బాలాజీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాపు ఉద్యమానికి ఆద్యుడు మిరియాల

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మిరియాల వెంకటరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, నాయకులు చనమల్ల ప్రసాదరావు, కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాపుల అభ్యున్నతికి అహర్నిశలు పోరాటాలు సాగించి ఉద్యమానికి ఆద్యుడుగా నిలిచిన వ్యక్తి మిరియాల వెంకటరావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గాజువాకలో కాపు రిజర్వేషన్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ హాలులో ఆది వారం జరిగిన వెంకటరావు 11వ వర్ధంతి సభలో వారు పాల్గొని నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడారు. కాపులకు రాజకీయంగా అన్యాయం జరుగుతోందంటూ 1988లో విజయవాడలోఇరవై లక్షల మందితో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఉన్నతంగా జీవించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు, నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, గుడివాడ అమ్మన్న, రావి శ్రీనివాసరావు, గంధం వెంకటరావు, సీరుకొండ రామచంద్రరావు, కర్రి నాగేశ్వరరావు, సిరసపల్లి నూకరాజు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్, సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన

సింధియా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ గల్లా పోలిపల్లీ (చిన్నా) ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి. గణబాబు సహకారంతో వార్డులో పలు అభివృద్ధి పనులు చేపడుతునట్లు తెలిపారు. బాలదుర్గా గుడి సమీపంలో జీవీఎంసీ నిధులతో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్, రూ. 10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి, కొండవాలు ప్రాంతంలో మెట్లు మరమ్మతుల కోసం నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కార్యదర్శి గుడేల కృష్ణ, బాబురావు, పొలై రాజు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత

గాజువాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో వినికిడి సమస్యతో బాధపడుతున్న గాజువాక నియోజకవర్గం 85వ వార్డు ప్రాంతానికి చెందిన తాడి రిషిపాల్ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం గాజువాక పార్టీ కార్యాలయంలో అందజేశారు. బాలుడికి అత్యాధునిక చికిత్సకు పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ గాజువాక సమసన్వయకర్త, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఉక్కు' ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలి : ఇంటక్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ కోరారు. ఉద్యోగులకు సుమారు నాలుగు నెలల జీతం పెండింగ్‌లో ఉందని, దీనిని చెల్లించేందుకు యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇంటక్ సహాయంతో సాధించుకున్న ఆర్థిక ప్రయోజనాలకు గండి పడిందని, వీటిని పునరుద్ధరించాలన్నారు. అలాగే టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న వారికి విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరారు.

బోధన విధానంపై గురుకుల సహాయ కార్యదర్శి ఆరా



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న గురుకుల పాఠశాలల సహాయ కార్యదర్శి రూపారాణి

గోపాలపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(మేహాద్రిగెడ్డ)ను రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.రూపారాణి ఆదివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి అధ్యాపకుల బోధన విధానం, వసతులు, భోజన ఏర్పాట్లు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల్ని సద్వినియోగం చేసుకుని సత్ఫలితాలు సాధించాలని సూచించారు. పది, ఇంటర్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. డీసీవో జి.గ్రేసీ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలు రక్షించిన పోలీసులు

పెందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య కలహాల నేపథ్యంలో క్షణికావేశంలో రసాయనం తాగిన మహిళను సకాలంలో పోలీసులు స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చినముషిడివాడ చాణక్యనగర్‌లో ఉంటున్న గుబ్బిలాపు భాగ్యలక్ష్మి(24) తన భర్తతో కలహాల కారణంగా బాత్రూమ్‌లోకి వెళ్లి తలుపులు మూసుకుని లైజాల్ తాగినట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ వెంటనే స్పందించి బ్లూకోట్ కానిస్టేబుల్‌ని అప్రమత్తం చేశారు. స్థానికుల సహకారంతో తలుపులు విరగ్గొట్టిన పోలీసులు ఆమెను రక్షించి ప్రాణాపాయం నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కాలువపై గ్రిల్‌కు మరమ్మతులు



గ్రిల్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపాలెం అండర్‌పాస్‌వే వద్ద కాలువపై శిథిల స్థితికి చేరిన గ్రిల్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. అండర్‌పాస్‌వే ప్రారంభంలో ఉన్న కాలువపై ఏర్పాటు చేసిన గ్రిల్ వద్ద వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'ఆదమరిస్తే అంతే సంగతులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ సొంత నిధులతో గ్రిల్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

వాటర్ సంపు వద్ద భారీ కొండచిలువ పట్టివేత



స్నేక్ క్యాచర్‌లు పట్టుకున్న కొండచిలువ

గోపాలపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 92వ వార్డు పద్మనాభనగర్‌లోని జీవీఎంసీ వాటర్ సంపు వద్దకు భారీ కొండచిలువ రావడంతో స్థానికులు కలవరపడ్డారు. పద్మనాభనగర్‌లోని కొండవాలు సమీపంలో ఉన్న జీవీఎంసీ వాటర్ సంపు వద్దకు శనివారం రాత్రి సుమారు 10 అడుగుల పొడవుగల కొండచిలువ వచ్చింది. సమీపంలో ఉన్న కొందరు కొండచిలువను గుర్తించి గ్రామంలో ఉన్న స్నేక్ క్యాచర్‌లు మణికంఠ, జగదీశ్‌లు కొండచిలువను పట్టుకుని స్నేక్ క్యాచర్ సొసైటీ సభ్యుడు కిరణ్ కుమార్‌కు అప్పగించగా ఆయన విశాఖ శివారులోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల సిబ్బందికి అప్పగించారు.

'యాదవులు రాజకీయంగా ఎదగాలి'

మల్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎదిగితేనే సామాజిక న్యాయం జరుగుతుందని పశ్చిమ నియోజకవర్గం యాదవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీఎస్ఎన్ మూర్తి అన్నారు. శ్రీహరిపురం పవన్‌పుత్రనగర్‌లో ఆదివారం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం ఆశయం నెరవేరేవరకు ఐక్యంగా ఉండాలని కోరారు. పల్లా శ్రీనివాసరావు (హోటల్) అధ్యక్షతన సమావేశం జరిగింది.